POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మే 2021
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 01



శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి, జయంతి (20-05-2021)

# బాలల
# శ్రీ సాయి లీలామృతము



శ్రీమతి అడిదం వేదవతి

# దుఃఖాన్ని రూపుమాపుకోవడమే ఆధ్యాత్మికత !

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ఈ అనంతమైన ప్రకృతిలో పశుపక్ష్యాదులన్నీ తమ జీవితావసరాలను సాధించుకుంటూ, జాతిని కొనసాగించుకుంటూ జీవించి నశిస్తాయి. ఇందుకవసరమైన కృషి చేయటానికి మాత్రమే తగిన ప్రజ్ఞ కలిగి వుంటాయి. కనుక ఆ ప్రాణులకు నిత్యజీవితావసరాలకు అన్యంగా తృప్తి-అసంతృప్తి అనే ద్వంద్వాలున్నట్టు తోచదు. అందువలన వాటి వ్యక్తిగత జీవితాలుగాని, సామూహిక జీవితాలుగాని ధర్మాధర్మాలు, ప్రగతి, తిరోగతులు అనే ప్రశ్నలే లేకుండా గడిచిపోతాయి.

కాని మనసు కలిగిన మనిషి జీవితమలా కాదు. నిత్యజీవితావసరాలు యెంతగా లభించినా మనిషికి తృప్తి, శాంతి వుండవు. ఒకవంక జిజ్ఞాస, రెండవవంక తమ జీవితాలను వ్యక్తిగతంగా మరింత సుఖశాంతి సంయుతంగా చేసుకోవాలని మానవులందరూ తాపత్రయపడతారు. వ్యక్తులు వారి వారి మానసిక పరిపాకాలననుసరించి ఈ లక్ష్యాలను సాధించుకోడానికి వివిధ సాధనాలను యెన్నుకొని వాటిని సాధించుకోడానికి తాపత్రయపడతారు. సుఖము, కీర్తి, డబ్బు, యింద్రియలోలత, కళలు మొదలైనవి మానవులు సామాన్యంగా యెన్నుకొనే సాధనాలు.

కానీ ఈ లక్ష్యాలను యెందరు యెన్ని స్థాయిలలో సాధించుకోగలుగుతున్నా వీరిలో ఒక్కరికీ తృప్తి, శాంతి కలుగకపోవడమే ఆశ్చర్యం. అంతేకాదు వీరిలో ప్రతి ఒక్కరూ తామెన్నుకున్న లక్ష్యాలను సాధించుకోడంలోస్వార్థమమకారాలకు లోనై, రాగద్వేషాలను పూని వివిధ స్థాయిలలో ధర్మానికి దూరమవడానికి కూడా వెనుకాడరు. అందువలన ప్రతి ఒక్కరి జీవితమూ అనేక రకాలైన అవరోధాలకు, ప్రతిఘటనలకు, దోపిడీలకు గురౌతుంది. సుఖానికోసం పరుగెత్తించే మానవుల మనస్సే జాతిలో ప్రతి ఒక్కరినీ ప్రకృతిలో మరే జంతువులూ పొందలేని అశాంతికి, దుఃఖానికీ గురిచేస్తుంది.

ఈ సత్యాన్ని గుర్తించిన కొద్దిమంది ప్రతిభావంతులు మానవ జీవితానుభవంలోని అంశాలైన ప్రకృతి, మానవజీవితము, మనస్సుల తత్త్వాన్ని లోతుగా పరిశీలించి యిట్టి దుఃఖానికి, అశాంతికీ కారణాలను గుర్తించారు. వాటిని సరిదిద్దుకొనడం ద్వారా మానవుడు తృప్తిని, శాంతినీ పొందగలడని గుర్తించారు. ఈ పద్ధతిని ఆత్మజ్ఞానము, ఆధ్యాత్మికత అన్నారు. ఇట్టి వారే మన ప్రాచీన ఋషులు, వివిధ దేశకాలాలలో ఉద్భవించిన మహనీయులు. ఇట్టివారే మానవ చరిత్రలో ఉద్భవించకుంటే మానవ జాతంతా పశుప్రాయమైన జీవితాన్ని గడుపుతూండేది. అంతకంటే గూడా యెంతో హీనము, బాధాకరమూ అయిన విషవలయంలో చిక్కియుండేదే.

వేదాలు, ఉపనిషత్తులు దగ్గర నుండి బైబిల్, ఖురానుల వరకు గల దివ్యజ్ఞాన సమన్వితమైన పవిత్ర గ్రంథాలన్నీ యిట్టి మహనీయుల వలన మనకు ప్రసాదించబడినవే. ప్రాకృతికము, పాశవికము అయిన జీవితం కంటే మహోత్కృష్టము, పరమ పవిత్రము, ఆనందకరము అయిన జీవిత విధానమొకటున్నదని వీరి వల్లనే మనకు తెలిసింది. అయితే ఈ పవిత్ర గ్రంథాలలోని గంభీరమైన భావాన్నీ, జీవితకళను సామాన్యులు అర్థం

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 మే-2021 సంచిక:01

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక,
మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | **దుఃఖాన్ని రూపుమాపుకోవడమే ఆధ్యాత్మికత!** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | **అవధూత శ్రీ చివటం అమ్మ** | శ్రీమతి టి.శారదా వివేక్ | 06 |
| 03. | **పరిప్రశ్న** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 10 |
| 04. | **సత్కార్యాల వల్ల మంచి ఎప్పుడూ వుంది!** | శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారు | 11 |
| 05. | **వార్తాలాపము** | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 06. | **శ్రీ సాయిబాబా ప్రసాదించిన పన్ను కథ** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 16 |
| 06. | **స్థితప్రజ్ఞుడు** | శ్రీ రామచంద్రరావు | 18 |
| 07. | **బల్వంత్ నాచ్నే** | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 22 |
| 08. | **ద్వారకామాయి అనుభవమండపము** | శ్రీమతి యం. పద్మావతి | 25 |
| 09. | **ఆచార్యుని అద్భుత లీలలు** | శ్రీ మల్లికార్జున్ | 26 |


చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |


సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

చేసుకొని అనుసరించగలగడానికి కేవల గ్రంథ పరిజ్ఞానమే చాలదని ఈ గ్రంథాలన్నీ చెబుతున్నాయి. అవి చెప్పిన మార్గాన నడచి, వాటిలోని సత్యాన్ని అనుభవగతం చేసుకొన్న చరితార్థులైన వారి సాంగత్యము, బోధ అవసరమని ఈ గ్రంథాలు మరలా మరలా నొక్కి చెబుతున్నాయి.

ఉదాహరణకు వేదాలను ఉత్తములైన వేదవిదుల నుండి అర్థయుక్తంగా అధ్యయనం చేయనిదే అవి నిరర్థకమౌతాయని అటు శ్రుతులు, సాయినాచార్యునివంటి వేదవిదులు చెబుతున్నారు. అలాగే ధర్మశాస్త్రాలుగూడ పూర్ణులైన మహనీయులనుండి వాటి అర్థాన్నీ, ధర్మసూక్ష్మాన్నీ గ్రహించి ఆచరిస్తే మాత్రమే ధర్మాలు ఫలవంతాలౌతాయని చెబుతున్నాయి. ఈ సూత్రమంతటినీ శ్రీ కృష్ణుడు భగవద్గీతలో (అధ్యాయం 4, శ్లో॥ 34) "తద్విద్ధి ప్రణిపాతేన..." అన్న శ్లోకంలో పొందుపరచాడు.

కనుక ఆధ్యాత్మికము, ధార్మికము అయిన జీవితానికి నాంది పరిపూర్ణుడైన మహనీయుని ఆశ్రయించడంతో ఆరంభమవుతుందని చెప్పాలి. అంతవరకూ మనం పాటించే ధర్మాలన్నీ, సలిపే ధర్మకార్యాలన్నీ మన జీవితాలు, మనస్సులు మరింత హీనస్థితికి దిగజారకుండా మాత్రమే కొంతవరకైనా ఉపయోగపడగలవు. అందుకే తెలియకపోయినా పూర్ణుడైన మహనీయుని ఆశ్రయం లభించేవరకూ ధర్మాన్ని యథాశక్తి ఆచరిస్తూ వుండమన్నారు పెద్దలు. కాని అట్టి మహనీయులు లభించాక "సర్వ ధర్మాన్ పరిత్యజ్య..." అన్న శ్లోకంలో చెప్పినట్లు మనకు శాస్త్రాలతో పనిలేదు. సర్వ ధర్మజ్ఞుడు, పరమ శ్రేయోభిలాషి అయిన సద్గురువే మనకవసరమైన ధర్మాలను – శ్రీకృష్ణుడు అర్జునునికి తెలిపినట్లు చక్కగా తెలుపగలడు. ఆయన చెప్పే నిగూఢమైన సత్యాలను మనమర్థం చేసుకొని విశ్వసించలేకపోతే – శ్రీకృష్ణుడు అర్జునునికి విశ్వరూప సాక్షాత్కారమిచ్చినట్లు తగిన ఆధ్యాత్మికానుభూతిని ప్రసాదించి, తగిన విశ్వాసాన్నీ, అవగాహననూ మనలో కలిగించగలరు. అందుకే సద్గురువును విశ్వసిస్తే చాలునని, వేరు శాస్త్రాలతో పనిలేదనీ శ్రీ శిరిడీ సాయిబాబా ఘంటాపథంగా చెప్పారు. ఉత్తముడైన వైద్యుడు లభించాక మన పరిమితమైన వైద్య పరిజ్ఞానంతోగాని, అసంఖ్యాకమైన వైద్య గ్రంథాలతోగాని ఏమి పని? అయినా వాటినే పట్టుకుని ప్రాకులాడేవాడి పరిమిత జ్ఞానానికి ఉత్తమ వైద్యునివంటి సద్గురువు చెప్పే బోధ అర్థంగాక ఉత్తమ శ్రేయస్సును పొందే సదవకాశం జారిపోతుంది.

భగవంతుడి అనుగ్రహం వలన, మానవుల మహద్భాగ్యం వలన అటువంటి పరిపూర్ణమైన మహనీయులు చరిత్రలో పొడుగునా ఉద్భవిస్తూనే ఉన్నారు. ఏ దేశకాలాలకు చెందిన ప్రజలు ఆయా దేశకాలాలలో ఉద్భవించిన మహనీయుల నాశ్రయించాలని "తద్విద్ధి ప్రణిపాతేన..." అన్న శ్లోకంలోని భావమని కొంచెమాలోచిస్తే తెలుస్తుంది. భగవద్గీతలో కృష్ణుడు వాచా చెప్పిన ప్రతి విషయాన్నీ శ్రీ సద్గురు సాయినాథుడు తన భక్తులకు దివ్యానుభూతుల ద్వారా తెలియచేశారని సమగ్రమైన వారి చరిత్రను చూస్తే తెలియగలదు. ఇటువంటి మహనీయులు ఆయాదేశకాలాల పరిస్థితులకు అనుగుణమైన రీతిన ఆధ్యాత్మిక విద్యను బోధిస్తుండడమే యిందుకు తార్కాణము, సౌలభ్యము గూడా. అంతటి మహనీయుడైన సాయినాథునియందు మనకు కొంచెమైనా భక్తి విశ్వాసాలు కలగడం మన పూర్వ పుణ్యమే.

ఆధ్యాత్మిక సాధన సఫలమవ్వాలంటే మనలో సత్వగుణము వృద్ధిపొంది తీరాలని భగవద్గీతలోని శ్రద్ధాత్రయ విభాగయోగము, గుణత్రయ విభాగయోగము అనే అధ్యాయాలు తెలుపుతాయి. మనలో సత్వగుణం వృద్ధిపొంది తక్కిన రెండు గుణాలూ తగ్గాలంటే, అసురీసంపద తొలగి దైవీసంపద స్థిరపడాలంటే యిటువంటి మహనీయులను బాహ్యంగాను, ఆంతరంగికంగానూ నిరంతరం సేవించడం ఒక్కటే మార్గమని భాగవతంలోని నారదుని వృత్తాంతం తెలుపుతుంది. భక్తితో చేసిన జపము–పూజ, దానము–యజ్ఞము మొదలైన సత్కర్మలు మాత్రమే సఫల మౌతాయని సకల శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఉదాహరణకు మహనీయుల అనుగ్రహంవలన మాత్రమే భక్తి కుదరగలదని 'నారద భక్తిసూత్రాలు' చెబుతున్నాయి. ఈశ్వరానుగ్రహం వలన గూడా కలగవచ్చని చెప్పినప్పటికీ అట్టి అనుగ్రహాన్ని పొందాలనుకొన్నా మనలో భక్తితో గూడిన పూజ, భజనాదులే సాధనాలుగదా!

కనుక సద్గురువును ప్రేమతో సేవించడమొక్కటే మార్గం. కాని అలా చేయగలగాలంటే అట్టివారి ప్రత్యక్ష

*మిగతా 28వ పేజీలో*

# అవధూత శ్రీ చివటం అమ్మ

(గత సంచిక తరువాయి)

శ్రీమతి టి.శారదా వివేక్

"అవధూతావస్థలో ఉన్న జీవన్ముక్తులు ఎవరి దృష్టినీ ఆకర్షించక, అందరికంటే మహోన్నతమైన స్థితిలో ఉంటారు. అట్టి పరిపూర్ణమైన అవధూత శ్రీ చివటం అమ్మ" అంటూ పూజ్య శ్రీ భరద్వాజ మాస్టర్ గారిచే కొనియాడబడిన అమ్మ జీవిత చరిత్రను ఆగష్టు 2019 సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. -ఎడిటర్

## అమ్మ బోధ

"అమ్మ మౌనమే నిజమైన బోధ -
నిరంతరమైన బోధ"
"గురోస్తు మౌన వ్యాఖ్యానం,
శిష్యోస్తుచ్ఛిన్న సంశయః"

పరబ్రహ్మాను గూర్చిన నిజమైన వ్యాఖ్యానం మౌనమేననీ, అట్టి గురువు యొక్క మౌనమే శిష్యుల సంశయాలను విచ్ఛిన్నం చేయగలదనీ, దక్షిణామూర్తి స్తోత్రం చెప్తుంది. అమ్మ కూడా అంతే! అమ్మ ఎప్పుడూ మౌనంగానే వుండేవారు. అవసరమైన కొన్ని మాటలు మాత్రం మాట్లాడేవారు. అయినప్పటికీ అమ్మ కూడా సాయిబాబా వలె సందర్భానుసారంగా భక్తుల సాధనకు అవసరమైన సూచనలను అందించేవారు. అమ్మ నోటి నుండి వెలువడిన చిన్న చిన్న సామాన్య వాక్యాలే మహోన్నత సత్యాలు - విశ్వద్రష్టలైన వేద ఋషులు చెప్పిన వేద మంత్రాలు.

అమ్మ రామాలయంలో కూర్చుని వుండగా ఒకరోజు సూరమ్మగారు, "మాకు ఏమీ తెలియదమ్మా -- మీరు మాకు ఏమీ చెప్పరు. మాకు ఇంక తెలిసేదెలా?' అని అమ్మను అడిగితే, "చెబితే తెలిసేది కాదే - చేస్తే తెలుస్తుంది. గురువు అనేవారు దారి చూపిస్తారు. ఆ దారిన నడిచి గమ్యం చేరవలసింది నువ్వే" అన్నారు అమ్మ. 'గురువు మీద కేవలం భక్తి వుంటే చాలదు. గురువు చెప్పినట్లు చెయ్యాలి. ఎలాగంటే, ఒక గొప్ప వైద్యుని మీద నీకు గౌరవం వున్నంత మాత్రాన నీ జబ్బు తగ్గిపోదు - అతడిచ్చిన ఔషధం

సేవించాలి - పథ్యం చెయ్యాలి - అలాగే ఇదీనూ' అంటారు పూజ్యశ్రీ మాస్టరుగారు. "ఆధ్యాత్మ విద్య ఎంతో కష్టము. శక్తినంతా వినియోగించి కృషి చేస్తే గానీ ఫలితం వుండదు. దున్నపోతు నెక్కి నాన్ఘేఘాట్ దాటటం కంటే కూడ కష్టం" అని శ్రీ శిరిడీ సాయిబాబా ఠాకూర్ తో అంటారు.

అమ్మ ఒకరోజు లక్ష్మిగారిని పిలిచి, అక్కడ ఉన్న కొబ్బరికాయ కొట్టి తీసుకు రమ్మన్నారు. ఆ కొబ్బరి చెక్కలు చూపిస్తూ, "ఈ కొబ్బరిలా హృదయం స్వచ్ఛంగా వుండాలే - ఏ సంకల్పాలూ లేకుండా" అన్నారు అమ్మ. మరి హృదయమలా స్వచ్ఛంగా వుండాలంటే ఏం చేయాలి? "దుక్కి దున్నాలే - దున్నకపోతే విత్తనమెలా వేస్తావు?" అన్నారు అమ్మ ఒక భక్తురాలితో. "నాకు అర్థం కాలేదమ్మా" అంటే, "ఆత్మజ్ఞానం అనే విత్తనం మొలకెత్తాలంటే, సాధన అనే దుక్కి దున్నాలి" అని చెప్పారు. అలానే మరొకప్పుడు అమ్మ "పాదు పెట్టందే, కాయెట్టా వత్తదే!" అన్నారు. సాధన చేస్తే కాని ముక్తి కలగదని అమ్మ భావం. కేవలం మహాత్ముల సన్నిధిలో వుండటం వలన మాత్రమే ఆత్మజ్ఞానం కలుగదు. శ్రీ సిద్ధారూఢ స్వామి అంటారు - "మహాత్ముల సన్నిధిలో వుండటం వలన మాత్రమే ముక్తి లభించేటట్లయితే, అందరికన్నా ముందు మహాత్ములు కట్టుకున్న లంగోటాకు ముక్తి లభించాలి" అని.

సాధన పట్టు వీడకుండా చేయాలంటే మొదట మన లక్ష్యం మీద ఎనలేని ప్రీతి వుండాలి! ఆధ్యాత్మికత అంటే ఏమిటో - మనం దేనికోసమై పరితపిస్తున్నామో - స్పష్టమైన అవగాహన వుండాలి. పూజ్యశ్రీ మాస్టరుగారు 'సాయిలీలామృతము' లో ఇలా చెప్తారు : "ఉన్నదానితో అసంతృప్తి, లేని దేనికోసమో తపన - ఇదే మానవ జీవితసారం. ఇలా దేనికోసమూ తపించవలసిన అవసరం లేని స్థితి ఆత్మజ్ఞానం వల్లగానీ రాదు. ఈ సంగతి దృఢంగా తెలియడమే వివేకం - దాని పర్యవసానమే వైరాగ్యం. ఇట్టి తపనకు, అశాంతికీ కారణం తనలోనే వుండి వుండాలని తెలుసుకున్నాక, దాన్ని తొలగించు కోవాలన్న నిశ్చయమే ముముక్షత్వం. అందుకు మార్గం తెలుసుకో జూడడమే జిజ్ఞాస. అందుకోసం జ్ఞానుల నాశ్రయించడం - సద్గురు సమాశ్రయం. వారి నుండి నేర్చిన సత్యాన్ని తనలో దర్శించే యత్నమే సాధన, ఆత్మవిచారణ. తాను ఏ ఆత్మజ్ఞానం కోసం తపిస్తున్నాడో, అదే సద్గురుని రూపంలో తారసిల్లే సరికి ఆయన యందు మనస్సు లగ్నమై పోతుంది. శరీరం ఆయన సేవకే అంకితమై పోతుంది - అదే గురుభక్తి. దానివలన జ్ఞానం కలుగుతుంది. దేనినీ కోరనవసరం లేని శాంతి, తృప్తి సిద్ధిస్తాయి."

ఆత్మజ్ఞానానికి నిరంతర ధ్యానమవసరం. నిరంతరం "రామా, రామా" అనుకోమని చెప్పేవారమ్మ. "రామా రామా" అందామంటే మనస్సు నిలకడగా ఉండటం లేదు. ఏవో సంకల్పాలు వచ్చేస్తున్నాయి. ఎలాగమ్మా?" అని రంగమ్మ గారు అమ్మను అడిగితే, "నువ్వు రామా! రామా! అంటూ కూర్చో - మనస్సు తిరిగి తిరిగి వేరే దారి లేక అదే నిలుస్తుంది" అన్నారు అమ్మ

భాస్కరి అనే అమ్మాయి ఒకసారి అమ్మను ధ్యానం ఎలా చేయాలని అడిగితే అమ్మ ఇలా చెప్పారు . "మొదట ఓంకారం చేసి, ఆ తరువాత మనస్సులో 'రామ రామ' అనుకుంటూ మౌనంగా కూర్చోవాలి. ధ్యానం నుంచి లేచేటప్పుడు కూడా ఓంకారం చేయాలి. అప్పుడు చీపురు పెట్టి వాకిట్లో తుడిస్తే ఎంత శుభ్రంగా వుంటుందో అలా వుంటుంది. ఓంకారం చేసేటప్పుడు మనసులోని అజ్ఞానం తొలగిపోతుంది." మరొకరితో అమ్మ ఇలా చెప్పారు - "ధ్యానం బంగారు ముద్ద వంటిది. ధ్యానానికి మించినది ఏదీ లేదు". "కాళ్ళు కడుక్కోకపోయినా ఫర్వాలేదే - రామ, రామ అనుకోండే" అనేవారు అమ్మ. భగవంతునికి కావలసినది అంతశ్శుద్ధి గానీ, బాహ్యశుద్ధి కాదు. ఒకసారి విస్సయ్య పంతులు గారి చిన్న చెల్లి అమ్మతో, "అమ్మా! కుటీరం బయట అలికి ముగ్గు పెట్టనా?" అని అడిగితే, "వద్దమ్మా వద్దు! మీరు లోపల అలుక్కోండే - లోపల అలుక్కోండే" అని చిన్నగా గొణుగుతున్నట్లుగా అన్నారమ్మ!

దేవుడు ఎక్కడ వున్నాడు? ఎట్లా వుంటాడు? - అని అడిగిన భక్తునితో విసనకర్రతో విసిరి, "బాబూ! గాలి బయట వున్నదా? విసన కర్రలో వున్నదా?" అన్నారు అమ్మ. భగవంతుడు పాలలోని వెన్నవలె సర్వవ్యాప్తంగా వుంటారు గానీ, చిలికితే

తప్ప వెన్న విడివడి కన్పించనట్లే, భగవంతుని తెలుసుకొనే ప్రయత్నం చేయనిదే ఎట్లా కన్పిస్తాడు? ఒకరితో అంటారు అమ్మ: "భగవంతుడు దూరంగా ఎక్కడో లేడురా! మన నోట్లోనే వున్నాడు. 'రామ రామ' అనుకోరా! అని. "నేను మీ కంఠనాళం కంటే దగ్గరగానే వున్నాను" అని భగవంతుడు చెప్పినట్లు ఖురాన్ చెబుతుంది. 'నేను' అంటే ఎవరో జాగ్రత్తగా గమనించమని చెప్తారు రమణమహర్షి. అన్నిటిలోనూ, అంతటిలోనూ విశ్వమంతా వ్యాపించి వున్న చైతన్యమే 'నేను' అనే ఎరుకగా మనలోనూ వున్నదని గుర్తించి, ఆ గుర్తింపును అనుక్షణం నిలుపుకోవడానికి ప్రయత్నించడమే సాధనంతా.

కానీ, మనలో చాలామందికి ఆధ్యాత్మిక లక్ష్యం మీద సరైన విశ్వాసం, దాన్ని సాధించాలనే పట్టుదలా వుండవు. అటువంటి వారికి భగవంతుడెట్లా కన్పిస్తారు? అని అడిగితే, అమ్మ "నాలుగు రూపాయలు సంపాదించాలని ఎలా ఆతృత పడతామో అంతకన్నా ఎక్కువ ఆతృతపడాలి" అన్నారు. రామకృష్ణ పరమహంస కూడా 'దేవుడెట్లా కన్పిస్తాడు' అని అడిగిన భక్తునితో, "నీటిలో మునిగి పోతున్నప్పుడు ప్రాణ భీతితో బయటపడాలని ఎట్లా కొట్టుకుంటావో అట్లా భగవంతుడి కోసం గిలగిలలాడితే కన్పిస్తాడు" అంటారు. "సాధనంటే చేటలో జొన్నలు పోసి, ఆకు కూరలు కొనడం కాదే – భగవంతుని తెలుసుకోవాలన్న ఆత్మమథనం జరగాలి" అన్నారు మాల పిచ్చెమ్మగారు. "కోటికి పడగెత్తాలనుకొన్నవాడు అనుక్షణమూ తన ప్రతి ఆలోచనా, ఇంకా ఇంకా డబ్బు సంపాదించడం కోసమే ఎలా వినియోగిస్తాడో ఆధ్యాత్మిక మార్గంలో కూడా అలాగే ప్రతి అడుగూ, ప్రతి ఆలోచనా మన లక్ష్యం వైపుగా వుండాలి" అంటారు మాస్టర్ గారు.

అమ్మ వృధా కాలక్షేపం సహించేవారు కాదు. ఒక భక్తురాలు సంజయ్ గాంధీ మరణించిన వార్తలున్న పేపర్ చదువుతుంటే, "ఎందుకే ఆ పేపరు? గీత చదువరాదా? అన్నారమ్మ. మనలో కూడా చాలామంది చదువుకున్నవారు, వార్తాపత్రికలు చదవడం–రాజకీయాలు చర్చించడంలో తమ విరామ సమయాన్నంతా గడిపేస్తుంటారు. దాని వలన మనకు ఒరిగేదేమీ వుండదు. అంతేగాక, మనస్సు ఎల్లప్పుడూ బాహ్య విషయాల పైనే వుంటుంది. అదే అభ్యాసమై పోయి, అంతర్ముఖం కావడం చాలా కష్టమౌతుంది.

"ఇంద్రియాలంటే ఏమిటి?" అని అడిగిన భక్తునితో అమ్మ "ఇంద్రియాలు ఏనుగు. మనస్సు గుర్రం. ఇంద్రియాలనరికట్టాలి" అన్నారు. సుశిక్షితుడైన రౌతుకే గుర్రం మాట వింటుంది. మనలాంటి వారు ఎక్కితే క్రింద పడేస్తుంది. మనస్సు కూడా అంతే! చిత్రమైన ఈ మనస్సును జాగ్రత్తగా గమనిస్తూ, నేర్పుగా మన మాట వినేటట్లు మచ్చిక చేసుకోవాలి. గుర్రానికి అటు ఇటు చూడకుండా కళ్ల మీద గంతలు వేస్తారు. మన మనస్సనే గుర్రానికి కూడా మార్గం తప్ప, మరేమీ చూడకుండా గంతలు వేసి నడిపించాలి. ఈ గుర్రపు స్వారీయే సాధనంతా!

అయితే ఏ లక్ష్యాన్ని సాధించాలన్నా ఓర్పు కావాలి. శ్రీ శిరిడి సాయిబాబా వారి గురువు, బాబా తల బోడి చేయించి, రెండు పైసలు దక్షిణ అడిగారట – ఒకటి నిష్ఠ, రెండవది సబూరీ (ఓరిమి). "సంతోషంగా ఆ రెండూ సమర్పించాను" – అంటారు బాబా! అలానే ఒకసారి సుందరకాండ చదువుతున్న లక్ష్మిగారితో అమ్మ, "ఓర్పు ఉండాలి. ఓర్పు ఉండబట్టే ఆంజనేయుడు కార్యం జయించుకొచ్చాడు. లేకపోతే, రామునికీ మాట వచ్చేదే – సుగ్రీవునికీ మాట వచ్చేదే – ఓర్పే దేముడు" అన్నారు.

ఒకరోజు రాత్రి అమ్మ కాళ్లకు నూనె రాస్తూ లక్ష్మీగారు, "సీతాదేవి ఎంత తెలివిగలదో" అన్నారు. అప్పుడమ్మ "సీతాదేవి భూలోకమాత. అమ్మ రాముని కోసమే అలా వచ్చింది" అన్నారు. "ఆంజనేయులు కూడ తెలివిగలవాడేనండి" అని లక్ష్మీగారు హాస్యంగా అంటే "బంటు అంటే అలా ఉండాలి – ఆంజనేయులు లాగా. సేవ అంటే అలా చేయాలి" అన్నారు అమ్మ.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా.." అన్న గీతా శ్లోకానికి అసలైన అర్థం చెబుతూ నానాచందోర్కర్ తో బాబా అంటారు : "మీకు బుద్ధి పుట్టినప్పుడు మాత్రమే చేసేది కాదు సేవంటే. గురుసేవ కోసమే తన శరీరం వున్నదనీ, దానిపై తన కెట్టి అధికారమూ లేదనీ తలచి

చేసినదే సేవ. అట్టివాడే శిష్యుడు" అని. అలాంటి శిష్యుడైన దీపకుని కథ శ్రీ గురుచరిత్రలో చదువుతాం. అటువంటి సచ్ఛిష్యునికి సకల దేవతలూ, శ్రీ మహావిష్ణువు కూడా అధీనంలోవుంటారు.అమ్మచెప్పినప్రతి చిన్నమాట వెనుకా, ఎంతటి లోతుగల ఆధ్యాత్మిక రహస్యాలున్నాయో తరచి చూచుకొన్నప్పుడే మనం అమ్మను అర్థం చేసుకొన్నట్లు!

"ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వ దర్శినః" అనే వాక్యానికి శ్రీ సాయినాథుడు చెప్పిన అర్థం ఇంతవరకు ఏ భాష్యకారుడూ చెప్పలేదు అంటారు మాస్టర్ గారు. 'ఉపదేక్ష్యంతితే అజ్ఞానం' అంటూ బాబా ఇలా వివరిస్తారు : జ్ఞానమంటే అజ్ఞానాన్ని తొలగించడమే. జ్ఞానం అనుభవంతో మాత్రమే కలుగుతుంది గానీ, మాటలకు, ఊహలకు అందదు. కనుక దానిని వాచా బోధించడం సాధ్యం కాదు. పాత్రకు పట్టిన మసిని మట్టితో రుద్ది పోగొట్టినట్లు, గురువు తన బోధ అనే సాత్వికమైన అజ్ఞానంతో శిష్యుని అజ్ఞానాన్ని తొలగిస్తాడు. అందుకే అమ్మ వాచా ఏమీ బోధించేవారు కాదు. "మాటలే మాయ" అన్నారు అమ్మ. అవసరమైనప్పుడు మాత్రం ఎదుటి వారి కర్థమయ్యే సామాన్య భాషలో, ముక్తసరిగా మూడు ముక్కలు - చిన్నగా లోగొంతుతో చెప్పేవారు. అయినప్పటికీ, వారి వాక్కుకున్న శక్తి వలన, వినేవారి సంశయం తీరి, అమ్మ చెప్పదలచుకున్నది చిత్రంగా అనుభవమయ్యేది.

అమ్మ వాక్కు వేదవాక్కే! 'తత్వమసి' అనే వేద వాక్యానికి అమ్మ చెప్పిన అర్థం ఎంత హృద్యంగా వుందో! 'తాను మసి అవ్వడమేనే - తత్త్వమసి' అంటే అన్నారు అమ్మ. 'తాను' మసి అవ్వడమంటే - నేను వేరు - జగత్తు వేరు అనే అన్యత్వ భావాన్ని కాల్చివేయమని - అన్యత్వ భావం పోతే సర్వగతంగా వున్న చైతన్యమేదైతే వుందో అదే మనలోనూ అనుభవ మవుతుంది. అందుకనే అమ్మ అంటారు - 'అహం బ్రహ్మాస్మి' అంటే అర్థమేమని అడిగిన భక్తునితో, "అహం చస్తే బ్రహ్మమే" అని! నిజానికి ప్రతివాడూ బ్రహ్మ స్వరూపే - కానీ అజ్ఞానం వలన తాను పరిమితుడైన వ్యక్తిగానూ, ప్రకృతి నుండి భిన్నుడుగానూ అనుభవం పొందుతున్నాడు. తాను పరిమితుడనైన వ్యక్తిని అనే అహంకారాన్ని నిర్మూలించి నప్పుడు, మిగిలేది అంతా బ్రహ్మమే! నేను వేరు అనే భావాన్ని పోగొట్టుకోవడానికి బదులు కొందరు 'నేనే బ్రహ్మాన్ని' అనే భావంతో 'అహం బ్రహ్మాస్మి" అని నామజపం చేస్తుంటారు. అమ్మ అటువంటి పొరపాటుకు తావే లేకుండా స్పష్టంగా, సులువుగా వివరించారు. తాను పరిమితుడను అన్న భావాన్ని పోగొట్టుకోవడానికి సంకేతమే ఏసుక్రీస్తుకు శిలువ వెయ్యడం - అని గ్నాస్టిక్స్ అనే సాంప్రదాయం వారు చెప్తారు. అమ్మ కూడ, "ఏసూ, రాముడూ వేరు కాదే" అంటారు.

అంతటి అవగాహన వున్న అమ్మకు వీరీ కులం వారు, ఆ మతం వారు అనే భావం అసలు వుంటుందా? ఏ కులం వారైనా, ఏ మతం వారైనా, తన దగ్గరకు వచ్చినా - తప్పుకు తిరిగినా నమస్కరించినా - ద్వేషించినా, వారి పట్ల అమ్మ వైఖరిలో మార్పు వుండేది కాదు. పేదవాడైన కుమ్మరిదాసు అమ్మ దగ్గరకు తరచు వస్తుండేవాడు. అతడు తర్వాత క్రైస్తవ మతం స్వీకరించి అమ్మ వద్దకు రావడం మానేశాడు. ఆ విషయం భక్తులు అమ్మతో చెప్తే, అమ్మ అన్నారు, "పాపం, ఏం జేస్తాడే? మనమంతా తవ్వెడు బియ్యం ఇవ్వక పోతే" అన్నారు. తల్లి తన బిడ్డ ఎక్కడైనా కడుపునిండా తిని క్షేమంగా వుండటమే కదా కోరుకునేది! అంతేకాదు - మన సమాజంలోని అసమానతల వలనా, అస్పృశ్యత వంటి దురాచారాల వల్లనే ఎంతో మంది మతం మార్చు కోవడం జరిగిందన్న సత్యాన్ని అమ్మ చెప్పకనే చెప్పారు. మహాత్ముల బోధలను మనస్ఫూర్తిగా పాటిస్తే. సంఘంలో హెచ్చు తగ్గులూ, కక్షలు కార్పణ్యాలూ లేకుండా దేశం సుఖశాంతులతో అలరారు తుంది. ఒకసారి గొయ్యమ్మ అనే హరిజన స్త్రీని పిలిచి అమ్మ తమ భిక్షాపాత్రలోనే ఆమెకు అన్నం కలిపి పెట్టారు. అక్కడి వారు, "అదేమిటి? మీ భిక్షాపాత్రలోనే పెట్టారు?" అంటే - "ఇది అలాగే పెడుతుందే - అంతే" అన్నారు.

- సశేషం

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## ప్రశ్న :- సాయిబాబా రాతిపై కాలుమీద కాలు వేసుకొని కూర్చొనడంలో భావమేమి?

-చి. సుబ్బరామరెడ్డి, రేబాల

**జవాబు:-** దేహం ధరించాక ఎలాగో ఒకలాగ కూర్చోవాలి గదా? ఎలా కూర్చున్నా ఈ ప్రశ్న వస్తుంది గదా? ఆయన చెప్పదలచినది లీలలు, మాటలలో, ఆచరణలో బోధించారు గదా? ఆయన కూర్చున్న భంగిమను రకరకాలుగా వివరిస్తున్నారు. వారి రెండు చేతుల వేళ్ళు ద్వంద్వాలని, వాటి మధ్య తొంగిచూచే వారి బొటనవ్రేలు పరమాత్మయని కొందరంటారు. వెనకనున్న మూడు వ్రేళ్ళు త్రిగుణాలని, వాటినుండి చూపుడు వ్రేలు అనబడు జీవుణ్ణి విడుదల చేయగల్గిన సద్గురువు యొక్క పాదాన్ని అలా ఆశ్రయించాలని వారిభావమని కొందరంటారు. ఇలా ఎన్ని రీతులు వివరించుకున్నా అవి మన భావాలే అవుతాయి. వీటిలో దేనిని ఆచరించాలన్నా వారి చరిత్ర మరల మరల పారాయణ చేస్తూ, వారు చెప్పినట్లు చింతనచేస్తూ వారి ప్రత్యేకానుగ్రహం కోసం 'శ్రీ గురుచరిత్ర' పారాయణ చేయడమొక్కటే మార్గం.●



# సత్కార్యాల వల్ల మంచి ఎప్పుడూ వుంది!

*శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి వారు*

ప్రపంచమందలి ప్రతి ప్రాణీ ఏదో ఒక పనిలో మునిగి తేలుతూ వుండడం మనం నిత్యమూ చూచే విషయం. ఒక్క మానవులేకాక, పశు పక్షి కీటకాదులు కూడా ఎడతెగక ఏదో ఒక పని చేస్తూనే ఉంటవి. చీమ బియ్యపు గింజను శ్రమపడి తన కన్నంలోనికి లాక్కు వెళ్ళుతూంటుంది. పావురాలు ఆకాశంలో ఎగురుతవి. నత్త మందగమనం చేస్తూ వుంటుంది. ఫైళ్ళను (Files) మోసుకుని మనుష్యుడు కచ్చేరీలకు వెళ్ళుతుంటాడు. పనిలేని వాడొక్కడూ లేడు. అనివార్యంగా అనవరతం పని, పని, పని, చేస్తూ వుంది ప్రాణిలోకం. అందుకనే గీతలో భగవానుడన్నాడు "నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్య కర్మ కృత్". ఈ విషయం అందరకూ అనుభవమే.

కష్టం లేకుండా సుఖంగా కాలక్షేపం చెయ్యాలంటే మనం ఎన్నో సదుపాయాలు చేసుకోవాలి. వానికి పని అవసరం. కర్మ చేయకుండా ఒక క్షణం కూర్చోవటమంత కష్టమైన పని మరొకటి వుండదు. అనుదినం ఎదుర్కొనవలసినవాటిలో క్షుద్బాధ ఒకటి. ఈ క్షుద్వ్యాధికి అనుదిన చికిత్స చేస్తేకాని శమించడమంటూ లేదు. వ్యాధికి మందు ఎట్లు పరిమితంగా తీసుకొంటామో, తియ్యని మందని అధికప్రమాణం ఎట్లా గ్రహించమో అట్లే ఆకలిని అనుసరించి ఆహారానికి ఒక నియతి, నియమం వుండాలి.

అయితే ఆకలి తీరితే పనులు నిలిచిపోతవా? ధనవంతునికి అన్నానికి కొరతలేదు. వానికి పనిచేయవలసిన అగత్యమేమి? నిజానికి వానికున్న పనులతొందర మరొకని కుండదు. సంపాదించింది జాగ్రత్త చేయాలి. మరింత సంపాదించాలి. మరింత కూడబెట్టాలి. మరింత జాగరూకత... ఇట్లు వాని కార్య పరంపరకు అంతంలేదు.

స్వదేహ రక్షణానికి కొన్ని పనులు, మాతాపితరులకు, భార్యాసుతులకు సంబంధించిన పనులు కొన్ని, పాలకోసం ఉంచుకొన్న పశువుల రక్షణ. ఇవి చాలవన్నట్టు మోజు కొద్దీ పెంచే పిల్లి, ఇంటినికాచే కుక్క, వీనికై పడేపాట్లు! సేవకులు, స్నేహితులు వీరికై చేయవలసిన పనులు, గ్రామసంబంధమైన పనులు, మనిషి జీవితాన్ని కర్మశృంఖలాలలో బంధించివేస్తున్నవి.

దంతధావనాదులూ, మజ్జన భోజనాదులూ సొంత పనులు. గృహనిర్మాణమూ, జీవనోపాధికి వలసిన వస్తు సంపాదనా తనకేకాక, తనకు దగ్గరగా సంబంధించిన వారికిన్నీ ఉపయోగపడేవి. రోడ్లు వేయటం, కాలువలు త్రవ్వటం, ఆసుపత్రులు కట్టడం సామాజిక కార్యాలు. బీదలకు దానం చేయడం, రోగులకు శుశ్రూష చేయడం సానుభూతి తెలిపే పనులు. వార్ధక్యంలో తమ పనులు తాము చక్కబెట్టుకోలేక పోయినపుడు వారికి చేసే సేవ ఋణం తీర్చుకొనేపని. శైశవంలో తల్లిదండ్రులచే పాలింపబడి, వారి వృద్ధాప్యంలో తాను పెద్దవాడై వారికి చేసే సేవ ఇలాంటిది.

ఇవికాక, ఇంకా కొన్ని పనులు మనుష్యుడు చేస్తుంటాడు. ఒక పెద్ద భవనం నిర్మించి దానిపై శిలువ స్థాపించి అక్కడకు తరచు వెళ్ళుతుంటాడు, లేదా రుద్రాక్షలను ధరించి విభూతి పులుముకొని 'శివ శివ' యని జపం చేస్తుంటాడు. మరొకడు ఊర్ధ్వపుండ్రాలు పెట్టుకొని ఊరూరూ తిరుగుతుంటాడు. వీని వలన ఆకలి తీరదు. బట్టలు దొరకవు. ఒకడు సంధ్యావందనం చేస్తాడు. మరొకడు శ్రాద్ధం పెడతాడు. ఇంకొకడు తర్పణాలు చేస్తుంటాడు. వేరొకడు కొండలు మలిచి కోవెలలు కడతాడు. మరికొందరు, మతము పేరిట కలహ భోజనం చేస్తూ తలలు పగులగొట్టుకుంటూ వుంటారు. వీటి వలన ప్రయోజనమేమి? ఇవి చాలవన్నట్లు ఊరూరా భజన మందిరాలు, ప్రతిరాత్రీ గొంతుకలెండిపోయేటట్లు భజన చేస్తుంటారు. దీనికీ ఆఫీసు పనికిన్నీ ఏవిధమైన సంబంధం లేదు. ఇది అవసరమా?

ఎవరినైనా నీకు ఒకపూట భోజనం కావాలా? లేక పదిరూపాయిలు కావాలా? అని అడిగితే రూపాయిలే ఇవ్వమని కోరుకుంటాడు. రూపాయలను నిలువ చేసుకొనే సులువున్నది. ఒకపూట అవసరం అన్నం తీరిస్తే, పది రోజుల అవసరం పదిరూపాయలు తీరుస్తవి. దీర్ఘకాలిక ప్రయోజనాన్నే ప్రతివారూ వాంఛిస్తారు. వాంఛలు అపరిమితమైపోయినవి ఈ రోజుల్లో. పూర్వం బస్సులు, రైలు బండ్లు ఉండేవికావు. ఎంత దూరమైనా నడచి వెళ్ళవలసి వచ్చేది. దానికి తగినట్లే ప్రయాణావసరాలు పరిమితిలో ఉండేవి. ఇప్పుడట్లాకాదు. ఎక్కడికైనా పోవచ్చు. ఎంతైనా ఖర్చుపెట్టవచ్చు. అందుచే అవసరాలూ, అవి లభించడానికి చేసే యత్నాలూ అపరిమితమైపోయినవి. ఆ కాలంలో ఎంత దూరమైనా నడచిపోయేవారు. కాళ్ళు బలపడేవి. ఇప్పుడు అరమైలు దూరం వెళ్ళడానికి రిక్షా, టాక్సీలు అవసరం. మితి అనేమాట మనకోశంలో ఏమూల గాలించిన కనబడదు.

దూరాలోచనతో, భావికాల భాగ్యానికి ద్రవ్యం ఆర్జిస్తున్నాం. ఎంతని నిలువచేయడం? వేయి రూపాయలా పదివేలా, లక్షా? ఆయుఃపర్యంతం ఆనందంగా ఉండాలని అందరి వాంఛ. మనకెంత ఆయువో మన మెరుగం. అది ఆ పరమేశ్వరునికే తెలియాలి.

మనం సేకరించే వస్తువులు ప్రాణ మున్నంతవరకూ ప్రయోజనపడతవనుటలో ఏమాత్రం సందేహం లేదు. కాని అటు తర్వాత అవి నిష్ప్రయోజనమైపోతున్నవి. భవిష్యత్ సౌఖ్యానికై పలువిధాల పరిశ్రమిస్తున్నా, నిరంతర సౌఖ్యం కలిగించే పనులు చేస్తున్నామా అంటే లేదు. నశించేది దేహమే కాని ఆత్మకాదు. అవినాశియైన ఆత్మలాభానికై చేసే పనులు, దేహానంతరం కరచరణాదులుండవు కనుక, ఇహమందే నిర్వర్తించుకోవాలి. అంటే ఆత్మజ్ఞానం మనం ముందు జాగ్రత్తగా ఇన్స్యూర్ చేసుకోవాలి.

'ఈ లోకం వాస్తవం. దీన్ని ఆలోచిస్తున్నాము కనుక పరలోకం మనం చూడలేదు. ఇహంలో సౌఖ్యంగా వుండవలసిన విధి ఎంతైనా వుంది. మరణించిన పిదప మనమున్నామో లేదో ఎవరికెరుక?' అని ఎవరయినా అంటే, ఒకవేళ ఉన్నామనే అనుకొందాం. అపుడేమి చేయాలి? ఏడవాలా? "నాస్తిచేన్నాస్తినో హానిః ఆస్తిచే న్నా హతః" దేహాంతరం జీవమున్నదనుకొన్న వాడు రెండు విధాల బాగుపడతాడు. లేదనుకొన్న నాస్తికుడు మోసపోతాడు. సత్కార్యాలవల్ల మంచి ఎన్నడూ వుంది.

ఎక్కడికైనా ప్రయాణం పెట్టుకొన్నపుడు మనిషి ప్రశాంతంగా ఉండాలని కోరుకొన్నట్లే అంతిమ ప్రయాణం కూడా ఆనందంగా ఉండాలని కోరుకుంటే, దానికి తగిన విధులను నిర్వర్తించాలి. చేసే కర్మకు ప్రస్తుతం ఫలితం లేకపోయినా పిదప తప్పక ఉంటుందన్నది జ్ఞానమార్గంలో మనకు బాగా అవగతమవుతుంది. ఒక శక్తికి ప్రతిఫలం ఎప్పుడైనా ఉంటుందన్న న్యూట్యన్ సిద్ధాంతం మన పెద్దలు ఏనాడో గుర్తించి వున్నారు. క్రైస్తవులు జన్మాంత సిద్ధాంతాన్ని ఒప్పుకోరు. కాని మరణానంతరం ఒక న్యాయతీర్పు ఉందని అంటారు. దానితో కర్మానుసారం పాపమో, నరకమో నిశ్చయింపబడుతుందనిన్నీ అంటారు. సుఖదుఃఖాలు అనుభవించిన మృతదేహాన్ని పెట్టెలో పూడ్చరని అనుకుందాం. అయినప్పటికీ దేశాంతరంలో సుఖదుఃఖాలను అనుభవించే శక్తి దానికి వున్నదనేనమ్మి కదా ఈ న్యాయతీర్పు చెబుతుంది. కాగా వారికి తెలియకుండానే జన్మాంతర సిద్ధాంతంలో విశ్వాసమున్న సంగతి ఇది సూచిస్తుంది. మన సుఖదుఃఖాలకు కారణం పూర్వం చేసుకొన్న కర్మ. పురాకృత ఫలం ఈ జన్మ. ఈ జన్మలో సుకృతదుష్కృతాలనూ, తత్ఫలితమైన సుఖదుఃఖాలనుఅనుభవించేటందుకూ మరొక జన్మ అవసరం కాదా? అందులో

*మిగతా 28వ పేజీలో*

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## ఏడవ ప్రసంగము

### భోగాల వలన చిత్తవృత్తులకు ఏకాగ్రత లభించదు

ఇతర గ్రంథాలలో కూడా ఇలాగే ప్రాణ రక్షణ కోసము, చిత్తము ఏకాగ్రము చెందడానికి అనేక రకాలైన ఆహారాలు వ్రాయబడ్డాయి. అవి తప్ప మిగిలినవి భోగ పదార్థాలని చెప్పబడ్డాయి. భోగము, యోగము --రెండూ ఒకదానికొకటి విరుద్ధాలు.

బేచరభాయి : తమంతట తాము తినకూడదు కానీ ఇతరులు ప్రార్థించినట్లైతే స్వీకరించడంలో తప్పేమిటి?

స్వామి ప్రకాశానంద : త్రిదోషాలు (వాత, పిత్త, కఫ దోషాలు) ప్రకోపించి తీవ్రజ్వరంతో బాధపడుతున్నవాడు ఒక్కసారి పెరుగు అడిగినంత మాత్రాన ఆప్యాయంగా తెచ్చి, వాడిని బలవంతం చేసి దానిని తినిపిస్తే వాడి రోగము ముదురుతుందేగాని తగ్గదు కదా?! అలాగే ఇతరులు ఇబ్బంది పెట్టడం వలన భోగాలకు ఆశపడి తిన్నవాడికి చిత్తైకాగ్రత కుదరదు.

విషయభోగాలలో నిమగ్నమైన వారి మనస్సు కోరికలు కలిగించే వాటిపట్ల మొగ్గుతుంది. వారి మనస్సు అనేక వ్యావృత్తులలో (వ్యాపకాలలో) మునిగిపోతుంది. పరమాత్మ ప్రాప్తిని కలిగించే సమాధిస్థితిని పొందదు. ఆత్మను అనుసంధానము చేసే శక్తి వుండదు.

### భోగాలు ఎన్ని?

*శ్లో॥ సుగన్ధి వనితా వస్త్రం*
*గీతం పానం చ భోజనమ్ ।*
*శయ్యా చ భూషణం జ్ఞేయా*
*భోగోఽష్టవిధో బుధ్యైః ॥*

భావము : సెంట్లు, అత్తరులు, పూలు మొదలైన సుగంధ ద్రవ్యాలు, స్త్రీలు, వస్త్రాలు, సంగీతము, పానము(త్రాగడము), భోజనము, పాన్పు, అలంకారాలు అని భోగాలు ఎనిమిది రకాలు.

శివ సంహితలో కూడా యిలా వున్నది:-

శ్లో॥ నారీ శయ్యాసనం వస్త్రం
ధనమస్య విడమ్బనమ్ I
తామ్బూల భక్షయానాని
రాజ్యైశ్వర్య విభూతయః II

శ్లో॥ హేమం రౌప్యం తథా తామ్రం
రత్నం చాగరుధేనవః I
పాణ్డిత్యం వేదశాస్త్రాణాం
నృత్యం గీతం విభూషణమ్ II

శ్లో॥ వంశీ వీణా మృదఙ్గాశ్చ
గజేన్ద్రశ్చాశ్వ వాహనమ్ I
దారాపత్యాని విషయా
విఘ్నా ఏతే ప్రకీర్తితాః II

## ఐశ్వర్యం వలన చిత్తము యొక్క ఏకాగ్రతకు భంగం

భోగాలను అనుభవించడం వలన చిత్తము యొక్క ఏకాగ్రతకు భంగం కలిగినట్లే, ఐశ్వర్యము వలన అంటే అధికారము వలన ఏకాగ్రతకు భంగం కలుగుతుంది. ఐశ్వర్యమంటే రాజ్యానికి ఆధిపత్యము, సేవకులు, ఏనుగులు, గుఱ్ఱాలు మొదలైనవాటి మీద ఆధిపత్యము. ఈ ఐశ్వర్యము ఆత్మసాక్షాత్కారానికి విరోధి. ఇందువలననే ముముక్షువు ఐహికాలు (ఇహానికి), పారలౌకికాలు (పరలోకానికి చెందినవి) అనబడే రెండు రకాల భోగాలను, ఐశ్వర్యాలనూ కోరడు. యమధర్మరాజు ప్రలోభం కోసం నిర్దేశించిన భోగాలు మొదలైనవాటిని ఆశించకుండా నచికేతుడు ఆత్మసాక్షాత్కారం కోసం బ్రహ్మవిద్యనే కోరాడు.

నచికేతుని తండ్రి వట్టిపోయిన ఆవులను యజ్ఞంలో దానము చేశాడు. అప్పుడు నచికేతుడు చాలా చిన్నవాడు. అతడు శ్రద్ధాభక్తులతో తండ్రిని అడిగాడు. "నాన్నగారూ! మీరు వట్టిపోయిన ఆవులను బ్రాహ్మణులకు దానం చేశారు. మరి నన్ను ఎవరికి ఇస్తారు?" అని చాలాసార్లు అడిగాడు. తండ్రి విసుగుచెంది కోపంతో, "యముడికి" అని సమాధానం చెప్పాడు. పితృవాక్యపరిపాలకుడైన నచికేతుడు యమలోకానికి వెళ్ళాడు. యముడు ఆ సమయంలో ఇంట్లో లేడు. యముడి భార్య స్నానసంధ్యాదులు పూర్తి చేసుకుని దేవతార్చనకు రమ్మని నచికేతుడికి చెప్పింది. కానీ "యముడి దర్శనం చేసుకునేంత వరకు ఏమీ తీసుకోను" అని నచికేతుడు చెప్పాడు. అలా యముడి ఇంటిలో నచికేతుడు మూడు రోజులు నిరాహారిగా పడివున్నాడు. ఇంటికి వచ్చిన యముడు నచికేతుడిని చూసి ఇలా అన్నాడు: "నాయనా, నచికేతా! నీవు మా అతిథివి. మూడు రోజుల నుండి నిరాహారిగా వున్నావు. నీ పట్ల ప్రసన్నుడినయ్యాను. మూడు వరాలు కోరుకో."

నచికేతుడు ఇలా అన్నాడు - "మా తండ్రిగారు నా మీద కోపంగా వున్నారు. వారి కోపము తగ్గి శాంతించి ప్రేమగా ఉండేటట్లు మొదటి వరాన్ని ప్రసాదించండి." యముడు "తథాస్తు!" అన్నాడు. "స్వర్గాన్ని పొందడానికి కారణమైన యజ్ఞాన్ని ఎలా చేయాలి? దానిలో ఎన్ని ఇటుకలు ఉపయోగించాలి? ఈ యజ్ఞానికి సంబంధించిన విద్యావిషయాలను రెండవ వరంగా ప్రసాదించండి!" అని నచికేతుడు పలికాడు. యముడు యజ్ఞవిద్యను నచికేతుడికి నేర్పి ఇలా అన్నాడు: "ప్రపంచములో ఈ విద్య నీ పేరు మీదుగా విఖ్యాతి చెందుతుంది, నీవు మూడవవరాన్ని కోరు!" నచికేతుడు అడిగాడు; - "మరణం తరువాత ఆత్మ పొందే స్థితి గురించి నాకు తెలుపు, ఇదే నేను కోరే మూడో వరము. నాకు ఆత్మవిద్యను నేర్పించు."

యముడు ఇలా అన్నాడు. "దేవతలు కూడా ఈ విషయాన్ని తెలుసుకోవాలనుకుంటారు. ఇది చాలా రహస్యమైనది. దుర్లభమైనది. ఈ విషయాన్ని మాత్రం అడగవద్దు! నచికేతుడు ఇలా అన్నాడు - "మీరు చెప్పినట్లు ఈ విషయం ఎంతో దుర్లభమైనది. దేవతలకు కూడా ఇది తెలుసుకోవాలనే కోరిక వుంటుంది. కనుక ఇప్పుడు నేను వేరొక వరాన్ని ఎలా కోరగలను? ఆత్మవిద్యనే కోరుతున్నాను." నచికేతుడి సమాధానము విని యముడిలా అన్నాడు

శ్లో॥ శతాయుషః పుత్రపౌత్రాన్వృణీష్వ
బహూన్పశూన్ హస్తిహిరణ్యమశ్వాన్ I
భూమేర్మహదాయతనం వృణీష్వ
స్వయం చ జీవ శరదో యావదిచ్ఛసి II

భావం : "వందసంవత్సరాల ఆయుర్దాయము కల పుత్రులను, మనవళ్ళను కోరుకో! కావలసినన్ని పశువులను,

ఏనుగులను, బంగారాన్ని, గుఱ్ఱాలను, నివసించడానికి పెద్ద భూభాగాన్ని కోరుకో. నీ ఇష్టము వచ్చినంత కాలము జీవించు.

*శ్లో॥ ఏత త్తుల్యం యది మన్య సే వరం*
*వృణీష్వ చిత్తం చిరజీవికాం చ ।*
*మహాభూమౌ నచికేతస్త్వమేధి*
*కామానాంత్వా కామభాజం కరోమి ॥*

భావము: "ఇలాంటి వరమే నీకు ఇంకొకటి ఏదైనా వుంటే కోరుకో! ధనాన్ని, చిరంజీవిత్వాన్ని కోరుకో! ఈ మహాభూమిలో వర్ధిల్లు. నీకు కావలసిన కోరికలను ఇష్టమొచ్చినట్లు అనుభవించేవాడిగా వరమిస్తాను."

*శ్లో॥ యేయే కామా దుర్లభా మర్త్యలో కే*
*సర్వాన్కామాన్ ఛన్దతః ప్రార్థయస్వ ।*
*ఇమా రామాః సరథాః సతూర్యా*
*న హీదృశా లమ్భనీయా మనుష్యైః ॥*

భావము: మానవలోకంలో దుర్లభమైన కోరికలన్నీ నీ ఇష్టము వచ్చినట్లు అనుభవించే వరం కోరుకో! సౌందర్యవంతులైన స్త్రీలు, రథములు, వాద్యములు మొ॥న దుర్లభమైన కోరికలను కోరుకో! ఆ స్త్రీల పరిచర్యలను అనుభవిస్తూ భోగాలను అనుభవించు, అంతేగాని మరణం గురించి అడగవద్దు. అంటే మరణానంతరం ఆత్మవుంటుందా? వుండదా? అని అడుగవద్దు."

అది విని నచికేతుడు ఇలా అన్నాడు

*శ్లో॥ శ్వోభావా మర్త్యస్య యద న్త*
*కైతత్సర్వేన్ద్రియాణాం జరయన్తి తేజః ।*
*అపి సర్వం జీవిత మల్పమేవ*
*తవైవ వాహాస్తవ నృత్యగీతే ॥*

భావం : "ఓ అంతకా! (సర్వాన్ని నశింపజేయువాడా!) మీరు ఇవాళ ఇచ్చే అన్ని పదార్థాలు రేపు శక్తిని నశింపజేస్తాయి. బలము తగ్గిపోగానే మరణం తప్పదుకదా! కాబట్టి జీవితమేమీ చిరకాలం వుండేది కాదు. మీరు ఇస్తానన్నవన్నీ మీకే వుండుగాక!

*శ్లో॥ న విత్తేన తర్పణీయో మనుష్యో*
*లప్స్యామహే విత్త మద్రాక్ష్మ చేత్త్వా ।*
*జీవిష్యామో యావదీశిష్యసి త్వం*
*వరస్తు మే వరణీయః సఏవ ॥*

భావం : మానవుడు ధనము చేతనే తృప్తి చెందడు. మీ దర్శనమాత్రము చేతనే ధనం లభిస్తుంది. కానీ దానివలన ప్రయోజనమేమిటి? చిరంజీవిత్వం కూడా మీరు ఉన్నంతకాలమే వుంటుంది కదా! కాబట్టి నాకు మరణించిన తరువాతి విషయాల గురించే చెప్పండి. అదే నేను కోరుకునే వరము.

*శ్లో॥ అజీర్యతామమృతానాముపేత్య*
*జీర్యన్మర్త్యః క్వధఃస్థః ప్రజానన్ ।*
*అభిధ్యాయన్ వర్ణరతిప్రమోదాన్*
*అనతిదీర్ఘే జీవితే కో రమేత ॥*

భావం : బలహీనతను, మృత్యువును పొందని దేవతల దగ్గరకు చేరిన మానవుడు క్షీణతకు, మృత్యువుకు ఆలవాలమైన సామాన్య సుఖాలను ఎలా కోరుకోగలడు? తాత్కాలికమైన జీవితాన్ని ఎందుకు ఆశిస్తాడు?

భోగాలు, ఐశ్వర్యాలు, మాయాకార్యాలు (మాయవలన చేసే పనులు) – వీటి పట్ల వివేకరహితమైన దృక్పథాన్ని కలిగివుండడం వలన మోహం కలుగుతుంది. మాయాస్వరూపం గురించి పారసభాగంలో యిలా వున్నది.

మాయ మానవుడిని గుడ్డివాడిని చేస్తుంది. మాయపట్ల ఆకర్షితుడవ్వకుండా వుండడానికి ఆశ, తృష్ణ – వీటిని తగ్గించాలి. అప్పుడు హృదయంలో పరమేశ్వరుడికి సంబంధించిన అనుభవాలు కలుగుతాయి. వాటి వలన బుద్ధి ప్రకాశిస్తుంది. మాయను స్మరించకూడదని సత్పురుషులు చెప్పారు."

కాబట్టి దేనిని స్మరించనే కూడదో దానిని పొందడానికి ప్రయత్నించేవాడు ఎంతటి అయోగ్యుడు! అటువంటి జీవితం వలన ఆత్మనిష్ఠ ఎలా కలుగుతుంది?

*మిగతా 28వ పేజీలో*

# శ్రీ సాయిబాబా ప్రసాదించిన పన్ను కథ

(సేకరణ)పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

శిరిడీకి చెందిన కాశీబాయి అనే ఒక కన్యను నీఫాడ్‌లోని ఒక పెద్దమనిషికిచ్చి వివాహం చేశారు. దురదృష్టవశాత్తు కొద్ది సంవత్సరాలు గడవగానే ఆమె భర్త దివంగతుడయ్యాడు. ఆయన చనిపోయే సమయానికి కాశీబాయి గర్భవతి. ఆమెకు సకాలంలో మగబిడ్డ గల్గాడు. అతడికి 'మాధవ్' అని నామకరణం చేశారు. ఆ బాలునికి సంవత్సరం వయస్సు వచ్చినప్పటి నుండీ కాశీబాయి పుట్టింటికి వచ్చి శిరిడీలోనే తన తల్లిదండ్రులతోనే నివసించసాగింది. ఆమెకు వేరొక జీవనాధారం లేకపోవడంతో ఆమె వేరే ఎవరి పొలంలోనైనా పని చేస్తుండేది. రోజంతా కష్టం చేసి నాలుగు రాళ్ళు సంపాదించుకొని చాలీచాలని బ్రతుకు వెళ్ళబుచ్చుకొనేది. పాపమా తల్లికి తన బిడ్డడి విషయమే పెద్ద చింత ఏర్పడింది. అతనిని క్రమశిక్షణతో పెంచే బాధ్యత తీసుకునేందుకు ఆమెకెవరూ అండలేరు.

ఆ మాతృహృదయం చివరకు వేరు దిక్కులేక మహాద్భుతమైన పని చేసింది. రోజూ ఆమె కూలికి వెళ్ళేటప్పుడు తన కొడుకును మసీదులో విడిచి వెళ్ళేది! సాయంత్రం పొలం నుంచి తిరిగి యింటికి వచ్చేప్పుడు దారిలో మసీదుకువెళ్ళి కొడుకును తీసుకొచ్చేది!! ప్రతి సాయంత్రమూ బిడ్డను తీసుకెళ్ళేప్పుడు ఆమె శ్రీ సాయికి భక్తిశ్రద్ధలతో నమస్కరించేది. కారణం మసీదులో సాయిసన్నిధిలో బిడ్డను విడుస్తున్నామన్న ధైర్యంవలన ఆమెకు పగలు పనిచేసుకొన్నంతసేపూ బిడ్డ గురించి ఎట్టి దిగులు, చింతా వుండేది కాదు. ఇదే ఆమెకు 4, 5 సం॥లు నిత్యకృత్యమయింది.

క్రమంగా మాధవ్ ఐదేండ్ల వాడయ్యాడు. అప్పటి నుండి నిత్యమూ శ్రీసాయి అతనికి ఒక రూపాయి యిచ్చేవారు. ఆ పిల్లవాడు గూడ సంతోషంగా తనకు చేతనైన సేవ సాయికి చేస్తూండేవాడు.

సాయి ప్రతిరోజూ సాయంత్రం ఎందరెందరికో డబ్బులిస్తారని కాశీబాయికి తెలుసు. ఒక రోజు ఆమె మసీదుకొచ్చి, "బాబా, మీరు నిత్యమూ కొందరికి ₹.50/- చొప్పున, కొందరికి ₹.30/- చొప్పునా యిస్తున్నారు. ఒకరికి రోజుకు ₹.25/- ముడితే మరొకరికి ₹.15/- చొప్పున లభిస్తున్నాయి. నా బిడ్డ మాధవ్ మీకెన్నో చిన్న చిన్న చిల్లర పనులు చేసి పెడుతున్నాడు గదా! వాడికి రోజుకు ఒక్క రూపాయి మాత్రమే యిస్తున్నారెందువలన?" అనడిగింది.

సాయి నవ్వి అన్నారు – "అమ్మా, కాశీబాయీ, నీ బిడ్డకిచ్చేకంటే ఎక్కువ ధనం కొందరు వ్యక్తులకిస్తున్న మాట నిజమే.కాని ఒకనాటికి యితరులందరికీ యిలా ధనం పంచడం మానివేస్తాను. కాని నీ బిడ్డకు మాత్రం శాశ్వతంగా యిస్తూనే వుంటాను. ఎవరూ దిక్కులేని నీలాంటి అనాథలకు నేనే దిక్కు!"

ఆమెకు సాయి చెప్పిన మాటలు సరిగా అర్థంగాక యిలా అన్నది "నా పతి అయిదేండ్ల క్రిందటనే గతించాడు; అప్పటినుండి విధవగానే జీవిస్తున్నాను."

ఆ మాట వినగానే సాయి ఉగ్రులై ఎలుగెత్తి కేకలెయ్యడం మొదలుపెట్టారు. వెంటనే ఆమె భయంతో మసీదు

నుండి జారుకొని యింటికి పోయింది. అంతేగాదు కొంతకాలం ఆమె మసీదుకు వెళ్ళడమే మానుకొన్నది. అయితేనేమి మూడవరోజుకల్లా సాయి భక్తులతో "ఏదీ, కాశీబాయి రాలేదేమి?" అనడిగి ఆమెకు కబురు చేశారు. ఆమె మాధవ్‌ను తీసుకొని మసీదు కొచ్చిందిగాని బాబాతో మాట్లాడడానికి ఆమెకు ధైర్యం చాలలేదు. అయితేనేమి? బాబా తామే ఎంతో సౌమ్యంగా ఆమెను బాగోగులు విచారించి పల్కరించారు. వెంటనే వదులుగా వుండి కదలుతున్న పంటినొకదానిని పీకి ఒక గుడ్డలో చిటికెడు విభూతితో కలిపి చిన్న మూటగా కట్టి ఆమెకిచ్చి, "ఈ తాయెత్తు జాగ్రత్తగా వుంచుకో! మేలు చేస్తుంది" అన్నారు బాబా.

శ్రీ సాయిబాబా జీవిత చరిత్రలో దామోదర్ రాస్నే అనే ఒక భక్తుడు పూణే నుంచి తరచు శిరిడీ వస్తూండేవాడని చదువుతాము. అతనికి సంతతిలేకుంటే సాయి అతనిని ఆశీర్వదించి నాల్గు మామిడి పండ్లిచ్చి "ఇవి నీ భార్య కివ్వు. ఆమెకు యిద్దరు కొడుకులు కల్గుతారు. వారికి దౌలత్ షా, తానీషా అని పేర్లు పెట్టు ఆ తర్వాత మరో యిద్దరు కొడుకులు కల్గుతారు" అన్నారు. అలానే నల్గురు కొడుకులూ జన్మించారు. వారిలో చివరివారైన నానాసాహెబ్ రాస్నే శిరిడీలో ఎంతో అనాయాసంగా సాయి చరణాలలో లీనమయ్యాడు.

వీరి తండ్రి దామోదర్ పంత్ రాస్నేగార్కి 'రాస్నే చౌల్' అనే సత్రముండేది. సుమారు 1945 ప్రాంతంలో అందులో రెండు గదులను మార్పుచేసి, అందులో సాయి పటం స్థాపించి పూజ, ఆరతీ చేయించ నారంభించారు. నిత్యమూ అక్కడ జరిగే ఉదయం, సాయంకాలం హారతులకు ఎందరో భక్తులు వస్తూండేవారు.

పోలీసు శాఖలో జమీదార్‌గా పనిచేస్తుండిన నికామ్ ఎంతో మంచి సాయి భక్తుడు. కనుక మందిర నిర్వహణలో అతని సంపూర్ణ సహకారం కోరాడు రాస్నే. వెంటనే నికామ్ ఉద్యోగం విడచి స్వయంగా ధూప దీప నైవేద్యాలు చూస్తూండేవాడు.

ఒకరోజు నికామ్‌కు సాయి స్వప్నంలో కన్పించి "నీవు నీఫాడ్‌లో మాధవ్‌రావ్ వద్దకు వెళ్ళి, అతని చేతికి వున్న తాయత్తు తీసుకొచ్చి నీ యింట పూజించుకో!" అన్నారు. వెంటనే అతడు నీఫాడ్ చేరి ఎంతో శ్రమపడి మాధవ్‌రావ్‌ను కలుసుకోగల్గాడు. సరిగా అంతకు ముందే సాయి తనకు కూడా స్వప్నంలో దర్శనమిచ్చి తనవద్దకొచ్చే ఒక వ్యక్తికి తాయత్తు యివ్వమని చెప్పారని చెప్పి మాధవ్‌రావ్ తాయత్తును నికామ్‌కు యిచ్చేశాడు. మహాసమాధి అనంతరం గూడ సాయి ఎంత నిత్యజాగరూకులోనని ఆ యిద్దరూ అబ్బురపడ్డారు. నికామ్ ఆ తాయత్తు తీసుకుని చాలాకాలం తనయింట పూజించుకున్నాడు.

కొంతకాలానికి, ముందుగా ప్రస్తావించినట్లు నానాసాహెబ్ రాస్నేగారు నికామ్‌ను పిలిపించి మందిర బాధ్యత వప్పగించారు. కొంతకాలానికి అతడు తనయింట పూజించబడుతున్న 'సాయి యిచ్చిన పన్ను' ను పుణేలో శివాజీనగర్‌లోని సాయి మందిరానికి సమర్పించాడు. ఈ పన్ను అచటి సాయి పాదుకల క్రింద వున్నది. ఆ మందిర మెంత ధన్యమైనది! అదీ చూద్దాము.

రాస్నే చౌల్‌లో రెండు గదులను సాయి మందిరంగా రూపొందించారని గమనించాము. అచటికి సాయి ప్రసాదించిన పన్ను చేరడం వల్లనో ఏమో అక్కడెన్నో మహిమలు జరుగుతున్నాయి. ఒక్క ఉదాహరణ!

అది జులై 12, 1961. నాడు అచటి 'పాన్ షెట్' డాము కూలిపోయి పుణే మహానగరమంతా జలమయమైందని అందరికీ తెలిసినదే. నగరంలో ఎక్కువ భాగం ఆ జలప్రళయం వలన నాశనమైంది. ఎన్ని ఇళ్ళు పేకమేడలా కూలి పోయాయో! అటువంటి ఆ మూతా నది గట్టు మీదనే ఆ సాయి మందిరమున్నది. ఆ జలప్రళయంలో సాయి మందిర గోపురం పైన దాదాపు 25 అడుగుల ఎత్తు వరకూ జలం ప్రవహించింది! మహాభవనాలనే ఆ ప్రవాహం నేలమట్టం చేయడంతో ఈ చిన్న ఫకీరు మందిరం కొట్టుకుపోయే వుంటుందని రాస్నే ఆందోళన పడ్డాడు.

వరదనీరు తీసివేయగానే ఆ సాయి భక్త మండలి సభ్యులందరూ గలిసి మందిరమంతటా పేరుకున్న బురద తీసివేశారు. అందుకుగాను ఆ బృందమంతా మూడు రోజులు నిర్విరామంగా కృషి చేస్తే గాని సాధ్యపడలేదు. కాని ఆ పాత సాయి మందిరం చెక్కు చెదరక యథాపూర్వం నిలచియున్నది! దాని ప్రక్కనే వున్న ఔదుంబర వృక్షం (శ్రీ దత్తాత్రేయ స్వామికి పవిత్రమైన మేడిచెట్టు) గూడ యథాపూర్వంవలెనే వున్నది! మందిరం లోపల ప్రతిష్టించబడిన సాయిబాబా గారి చిత్రంగూడ కించిత్తుకూడ చెక్కుచెదరక అలాగే వున్నది!! అన్ని రోజులు బురదలో కూరుకుపోయి గూడ ఆ పటం మాయకపోవడమే

*మిగతా 28వ పేజీలో*

# స్థితప్రజ్ఞుడు

శ్రీ రామచంద్రరావు

**(మాస్టరుగారి స్టూడెంట్‌గా వారి అద్భుత భావనా శక్తిని, బోధనా విధానాన్ని, సర్వజ్ఞత్వాన్ని, నిర్భయత్వాన్ని; ఒకటేమిటి వారి గురించి తమకు తెలిసిన గుణగణాలని పొందుపరచి మనకు వీరు అందిస్తున్నారు)**

నేను 1969-73 సంవత్సరములలో విద్యానగర్ కాలేజీలో డిగ్రీ చదివే రోజులలో మాస్టరుగారి గురించి విన్నాను. ఆ తర్వాత ఆయన్ను చూడటం జరిగింది. ఒకరోజు నేను అలా నడుచుకుంటూ వస్తున్నాను. వెనకనుంచీ ఎవరో మాట్లాడే మాటలు యిలా విన్పిస్తున్నాయి: "నేను ఇల్లు తుడిచాను. అంట్లు తోమాను. ఇలా చెప్పుకోటానికి నేనే మాత్రం మొహమాటపడను, సిగ్గుపడను" ఎవరా అని చూస్తే భరద్వాజ గారు. ఆయన మాకు ఇంగ్లీషు పొయిట్రీ కొచ్చేవారు. ఒక రోజు నేను క్లాస్ కి ఆలస్యంగా వెళ్ళాను. "ఎందుకు లేట్ గా వచ్చావు?" అని అడిగారు. "మెస్ లో బాగా లేట్ అయ్యింది. ఇంకా ఒక బాచ్ వారు అక్కడే వున్నారు" అని అన్నాను. ఒంగోలు దగ్గరున్న ఒక పల్లెటూరి నించి వచ్చిన వాడిని. నా మాట తీరు ఆయనకు ఎలా వుందోగాని ఆయన ఎవరితోనో, "ఆ కుర్రవాడెవరు? అంత రఫ్ గా మాట్లాడుతున్నాడు?" అని అన్నారట.

ఒకసారి ఆయన నన్ను ఇంటికి తీసికెళ్ళారు. అక్కడ బాబా ఫొటోలు అవీ చూపించారు. తర్వాత తర్వాత మా పరిచయం ఒక అనుబంధంగా, గురుశిష్యుల సంబంధంగా మారింది. నేను చాలా పేదవాణ్ణి. నన్ను దగ్గరకు తీశారాయన. నాకు ఒకసారి ఇంగ్లీషు టెక్స్ట్ బుక్స్ చదువుకోమని యిచ్చారు ఉచితంగా. ఆయన నాకేదో భిక్ష వేస్తున్నారనే భావంతో వెనక్కిచ్చేశాను. నా డ్రెస్ కూడా చిరిగి పోయి వికారంగా వుండేది. అందుచేత ఒకరకమైన ఫీలింగ్ వుండేది. బుక్స్ ని యిచ్చేశానే గాని కడుపులో పీకులాట. మాస్టరు గారేమనుకున్నారో ఏమోనని. మా ఫ్రెండ్స్ కొంతమంది "నువ్వేదో తెలివిగలవాడివని, సిన్సియర్ స్టూడెంట్ వని నీకు మాస్టరుగారు బుక్స్ యిచ్చారే తప్ప ఇంకే భావనా లేదు" అని చెప్పడంతో మరలా వారి దగ్గరకెళ్ళి ఆ పుస్తకాలు తెచ్చుకున్నాను. అలా ఆయన నాకు సరస్వతీ కటాక్షం కల్గించారు.

ఆయన మాకు ప్రోజు కి, పొయిట్రీకి కూడా వచ్చేవారు. వారి పొయిట్రీ టీచింగ్ చాలా ఎక్సలెంట్ వుండేది. అందులో కవి హృదయం తెలుసుకోటానికి లోతుగా వెళ్ళేవారు. వారి భావనా శక్తి అమోఘం. షెల్లీ వ్రాసిన ఒక పక్షి గురించిన పోయమ్స్ ను మాస్టరుగారు అలా చెప్తుంటే ఓహ్ ఎంతో అద్భుతంగా వుండేది. అందులో ఆదిశంకరుని అద్వైత భావాన్ని, షెల్లీ భావనతో కంపేర్ చేసి చెప్తుంటే అలా సైలెంట్ గా వింటుంటే ఒక శ్రావ్య కావ్యాన్ని వింటున్నట్టు, ఒక దృశ్యకావ్యాన్ని చూస్తున్నట్లు అనుభూతి కల్గేది.

ఒకసారి వార్తాలాపం అనే పుస్తకంపై ఒక కుక్క పడుకొని

వుంది. అది చూసి చిరాకేసి "వెధవ కుక్క పుస్తకం పాడు చేస్తున్నది" అని తిట్టాను. "దాన్నెందుకు అలా ఈసడించుకుంటావు. నేను చెప్పింది వింటారు గాని ఆచరించరు గదా!" అని అన్నారెంతో బాధగా.

ఆయనను మిమిక్రీ చేస్తూ మాట్లాడినా, లేదా సరదాగా మాట్లాడుకుంటున్నా ఆయన సంతోషించేవారే గాని ఏమనేవారు కాదు. ఒకసారి మాస్టరుగారెళ్ళిన తర్వాత నేను ఏదో లెక్చరిస్తున్నాను. ఇంతలో ఆయన మళ్ళీ వచ్చారు. నేను ఆయన్ను చూసి వెంటనే ఆపాను. అప్పడాయన "నేను రాగానే ఎందుకు ఆపేయటం? నేను వింటానుగా. ఇక నుంచి మీరే చెప్పాలి" అన్నారు.

ఏదో పనిమీద మాస్టరుగారు ప్రక్కవూరెళ్తుంటే నేనూ వారితో వెళ్ళాను. అక్కడ ఆయన ఎక్కువసేపు వుండలేదు. "నాకెందుకో వుండాలన్పించటం లేదు. ఇంటికెళదాం పద. అక్కడెవరో ఎదురు చూస్తూండాలి"అని అన్నారు. ఇంటికొస్తే తెల్సింది. నిజంగానే మాస్టరుగారి కోసం ఎవరో ఎదురు చూస్తున్నారు. ఇంకోసారి మాయీ అమ్మ దగ్గర కెళ్ళే ముందు మాస్టరుగారిని కలసి అమ్మ దర్శనం కావాలని దణ్ణం పెట్టుకున్నాను. ముందు అవరోధం కల్గినా మాస్టరుగారి ఆశీర్వాదం వల్ల అమ్మ దర్శనం అయింది.

ఒక్కోసారి ఆయన్ను చూస్తూంటే యీయన కంటే నాస్తికులు మేలేమోనని అన్పించేది. ఏ నియమనిష్ఠలు లేవు. ఆచారాలు పాటించేవారు కాదు. కాషాయ వేషధారణ గాని, వేషాడంబరము గాని లేక చాలా సింపుల్ గా వుండి సమయాసమయాలు పాటించక వచ్చిన వారినందరినీ సమాధాన పరచి పంపుతూండేవారు. ఆహారానికి, నిద్రకి వేళాపాళలుండేవి గావు.

"ఎప్పుడూ మనల్ని అది చెయ్యి యిది చెయ్యి అని చెప్తూంటారు కదా! మరి మాస్టరుగారేం చేస్తారో అడుగు" అని నా మిత్రులు నన్ను ఎక్కేశారు. నేను అడిగాను "ఏమి సార్ మమ్మల్ని ఏవేవో చేయమంటున్నారు. మరి మీరేమి చేస్తుంటారు సార్" అని అడిగితే "ఏమి చేయకుండా వుండటమే చేస్తూంటాను" అని అన్నారు నవ్వుతూ.

మాస్టరుగారు అంటూండేవారు, "నాకూ, విద్యానగర్ కి పూర్వజన్మ అనుబంధం వుంది. అందుకే ఇక్కడకు రాగల్గాను. ఇక్కడకు రాకముందెప్పుడూ నాకొక దృశ్యం కన్పించేది. ఒక కొండ, కొండ పైన గుడి కన్పించేది. ఇక్కడి కొచ్చింతర్వాత గూడలి కొండ, కొండపైన శివాలయం చూసిన తర్వాత ఆ దృశ్యం ఇదే అని అర్థం అయింది." ఆయన ఒకసారి చెప్పారు "ఆ కొండపై నా ఆశ్రమం ఒకటి వెలుస్తుంది" అని. అది ఎప్పుడు వస్తుందో ఏమో కాలమే నిర్ణయించాలి.

నాకు కొన్ని పరిస్థితులకు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవాలనే తలంపు ఒకానొక టైమ్ దృఢంగా కల్గింది. ఆయన దగ్గర కూర్చున్నాను. ఆయన వున్నట్టుండి కళ్ళు మూసుకొని కొంచెంసేపు అలా కూర్చున్నారు. కొంతసేపైన తర్వాత నాకేసి అలా చూసేసరికి ఏదో ఒక శక్తి ఆయన కళ్ళల్లోంచి వచ్చి నాలో ప్రవేశించినట్లు అన్పించింది. "మనిషి చచ్చి పోవాలనుకోవటం ఏమిటి? చచ్చిపోయే బదులు జీవితాన్ని మానవసేవకు అంకితం చేస్తే పోలా! భగవచ్చింతనతో గడిపితే పోలా!" అని అన్నారు. ఆ తర్వాత నుంచి నా మనస్సు మారి మళ్ళీ ఆ తలంపే కల్గలేదు. ఇంకోసారి నాకు సాధనలో ఏకాగ్రత కుదరటం లేదు. నేను ఈ విషయం గురించి మాస్టరుగారికి చెప్పనే లేదు. పాదనమస్కారం చేసుకున్నప్పుడు వెన్ను మీద నిమిరి తల మీద అలా చేయి పెట్టారు. అంతే అప్పట్నించి నాకు సాధనలో ఏకాగ్రత కుదిరింది.

సావనీర్స్ ప్రింటింగ్ చాలా ఆలస్యంగా చేయటం మూలాన అన్నీ అమ్ముడు పోలేదు. చాలా మిగిలిపోయాయి. వేస్ట్ అయ్యాయి అని మేం బాధపడుతుంటే "ఇవి మామూలు సావనీర్స్ కావు. వేదాలు, ఉపనిషత్తుల్లాగ ఇవి మున్ముందు సాధకులకెంతగానో వుపయోగపడతాయి" అని చెప్పారు. ఆయన చెప్పిన మాట నిజమేనని ఆ తర్వాత తెల్సింది.

మాస్టరుగారుండే యింటి వెనకవైపు ఒక ముసలాయనుండేవారు. ఆయనొచ్చి "మాస్టరుగారుండే యింటి చుట్టు ప్రక్కల పెద్ద పెద్ద పాములు, రక్త పింజరులు తిరుగుతున్నాయి" అని భయం భయంగా చెపుతుండేవారు. "అవంటే అంత భయం దేనికి. అవీ సృష్టిలోని జీవరాసులే, మనలాంటివే. మీరేమీ భయపడాల్సిన పన్లేదు" అని ఆయనకు అభయం యిచ్చారు. ఆ తర్వాత ఆయనకు ఆ భయం తీరింది.

మాస్టరు గారింటి దగ్గరగావున్న యింట్లో కొంత మంది ఆడవాళ్ళుండేవారు. వాళ్ళ మీద ఏదో గొడవలు జరిగితే పబ్లిక్ నుంచి విమర్శనెదుర్కోవాల్సి వస్తుందని తెలిసినా "న్యాయం ఎటువైపుంటే అటే

సపోర్ట్ చేయాలి. అన్యాయాన్ని ఎంత కష్టనష్టాలొచ్చినా ఎదుర్కోవాలి" అని చెప్పటమే కాక ఆచరించి చూపారు.

విద్యానగర్ దగ్గర్లో గుణపాడు అనే గ్రామం వుంది. అక్కడ శివాలయం వుంది. అప్పుడప్పుడు సాయంత్రం పూట మాస్టరుగారు మమ్మల్ని అక్కడకు తీసుకొని వెళ్తూండేవారు. ఆ రాత్రి అక్కడ శివాలయంలో పూజచేసి, అక్కడ వున్న వాగులో కూర్చొని సత్సంగం, భజన చేసుకునే వాళ్ళం. ధ్యానం చేసుకునే వాళ్ళం. మాస్టరుగారు సాధన గురించి ఎన్నెన్నో విషయాలు చెప్పేవారు.

ఒకసారి నాతో "సినిమాల్లో ఏముంది? సందేశాత్మకత లేదు. అలాంటి సినిమాలు చూస్తూ టైమ్ ని వేస్ట్ చేసుకొనే బదులు ఎన్నో మంచి కార్యాలకు వుపయోగించుకోవచ్చు" అని అన్నారు. ఆయన మాటల్లో ఏ సమ్మోహనా శక్తి వుందో గాని అప్పట్నించీ నాకు సినిమాలపై కోరిక నశించి పోయింది. మాస్టర్ గారి బుక్స్ 'ఏది నిజం', 'నిజానికి నిచ్చెనలు' మొదలైనవి ఎంతో విలువైనవని గ్రహించాను. ఆధ్యాత్మిక జీవితం గడపాలని నిశ్చయించుకున్నాను.

మాస్టరుగారు తిరుపతిలో ఎస్.వి.ఆర్ట్స్ కాలేజ్ కి స్పాట్ వ్యాలుయేషన్ కి వచ్చేవారు. మాకు అక్కడొక మీటింగ్ ప్లేస్ వుండేది. మాస్టరుగారూ, మేము అక్కడ కూర్చొని మాట్లాడుకునే వారము. అప్పట్లో అక్కడ ఒక ముస్లిం స్టూడెంట్ వుండేవాడు. ఫిలాసఫీ అతని సబ్జెక్ట్. అతనికి పెద్ద అనుచరవర్గం వుండేది. మేము మాస్టరుగారికి దణ్ణం పెట్టడము చూసి మా చర్చలు, సంభాషణలు విని మమ్మల్ని, మాస్టరు గార్ని ఎదుర్కోడానికి వచ్చాడు. వాళ్ళు వస్తున్నట్టు మాస్టరుగారికి ముందే అవగతమైంది. వాళ్ళు అడిగిన వాటికన్నింటికీ మాస్టరుగారు చెప్తుంటే వాళ్ళ ఫిలసాఫికల్ టరమ్స్ లో చెప్పలేదని చాలా సివియర్ గా మాస్టరుగార్ని అవమానపర్చారు. దూషించారు. మేమెంతో బాధపడ్డాం గాని, మాస్టరుగారేమో చలించలేదు.

ఒకసారి మాస్టరుగారింటి ముందు నుంచి వెళ్తున్నాను. ఆయన ముఖం సింహం మొహంలాగా కన్పించింది. భయం వేసింది. మళ్ళీ ఇంకోసారి తిరుపతి హాస్టల్ రూమ్ వుండగా అలానే కన్పించింది. మాస్టరుగారు రూమ్ లో వుండి గోవిందప్ప కోసం వెళ్ళమన్నారు. నాకది గౌరవానికి భంగమన్పించి అతనిని పిలవలేదు. అప్పుడు మాస్టరుగారు "ఎవరూ పిలవనక్కర్లేదు, అతనే వస్తాడు" అని అన్నారు. అలానే వచ్చాడు. మరొకసారి మొహిద్దీన్ సార్ స్పాట్ వాల్యుయేషన్ కి తిరుపతి వచ్చారు. ఆయనెక్కడో లాడ్జ్ వున్నారు. ఆయన్ను పిల్చుకురమ్మనమన్నారు మాస్టరుగారు. ఆయన కోసం వెతికాను. నాకు చొరవ కొంచెం తక్కువ. భయం వల్ల సరిగ్గా వెతకలేక పోయాను. లాడ్జి కెళ్ళి అడగలేకపోయాను. "ఒరేయ్ అంత టైమ్ వేస్ట్ చేసి చివరకు ఇదా నువ్వు చేసింది. వద్దులే ఆయనే వస్తారు" అన్నారు. నిజంగా ఆయనే వచ్చారు.

మాస్టరుగారికి పెళ్ళి అయిన తర్వాత జపమాల తీసుకొని జపం చేయటం నేను చూశాను. స్టూడెంట్సుమి కదండీ పెళ్ళైన తర్వాత గురువుగారు మారిపోయారు. మనలాగే భయం పట్టుకుందేమోనని అన్నాడొకడు. "మాస్టరుగారు మీరేమనుకుంటూ జపం చేస్తారు"అని అడిగితే, "ఈ ప్రపంచమంతా దేనితో చేయబడిందో ఆ చైతన్యాన్ని తలచుకుంటూ ఒక్కో రుద్రాక్ష తిప్పుతాను" అని సమాధానమిచ్చారు. ఒకసారి ఎవరితోనో అన్నారట, "నేనూ సాధన చేశాను. ఆమే చేసింది. అందువల్ల ఇంకా గొప్ప సాధకుడు పుడతాడు" అని. "ఇది నిజమా సార్?" అని, అడిగితే "నిజమే" అని చెప్పారు.

అప్పట్లో మాస్టరుగారు టి.టి.డి వారి చేత సాయిబాబా చరిత్ర ప్రింట్ చేయించాలని చాలా ప్రయత్నం చేశారు. ఇ. ఓ. గారిని కలిశారు. కానీ టి.టి.డి. వారు సాయిబాబా ముస్లిం అన్న సాకు చూపించి ప్రింట్ చేయమన్నారు. గ్రహణ సమయంలో మమ్మల్ని ధ్యానం చేయమన్నారు. "ఈ ప్రపంచమంతా ఒకటే చైతన్యం చేత చేయబడింది" అని అనుకోవటమే మాకు వారు చెప్పిన ధ్యానం. నిరంతరం బాబాని గుర్తు పెట్టుకోవాలి. భోజనం చేసే సమయంలో కూడా సాక్షాత్తు ఆ పరబ్రహ్మ స్వరూపం అయిన ఈ అన్నం నా శరీరంలో ప్రవేశించి నాకారోగ్యాన్ని ప్రసాదించుగాక! అని అనుకుంటూ తినమన్నారు.

మాస్టరుగారు తిరుపతి వచ్చినప్పుడు వైట్ పేపర్స్ తీసుకెళ్ళి ఆయన కిచ్చాను. "మన స్వార్జితం గాకుండా ఏ ఆఫీస్ నుంచో తెస్తే అది దొంగతనంతో సమానం" అన్నారు. అలాంటివి "ఏ పనికైతే వుపయోగిస్తామో ఆ పని అంత పర్ఫెక్ట్ గా పూర్తికాదు " అని తీసుకోకుండా తిరస్కరించారు. ఒక మున్సిపల్ కమీషనర్ గారు మాస్టరుగార్ని తరచుగా కలుస్తుండేవారు. ఒకసారి మాస్టర్ గారి బస వారింట్లో ఏర్పాటు చేశారు. రాత్రి అయ్యింది. అందరూ వెళ్ళిపోయారు.

ఇంక ఆయన పడుకోబోతూ, అక్కడ ఏర్పాటు చేసిన యూఫోమ్ బెడ్స్ వుపయోగించకుండా నేలమీద పడుకున్నారు. "ఏవరేమనుకున్నా మీరేమీ ఖాతర చేయక పోవచ్చు. కానీ మాకు మాత్రం 'మీ గురువు గారు ఇలా కటిక నేల మీద పడుకున్నారంటే' మాకెంతో సిగ్గుగా వుంటుంది" అని అంటే, అప్పుడాయన యిలా అన్నారు: "వాటి మీద పడుకుంటే అవి వుపయోగించే వారి సబ్-కాన్షస్-లెవెల్ లో వున్న కోరికలు, సంకల్పాలు నన్ను పట్టుకుంటాయి. రకరకాల మనుష్యులు, మనస్తత్వాలు, కోరికలు, ఈ గొడవలు మన మెక్కడపడతాం. కాబట్టి క్రింద పడుకోవటమే మేలు" అన్నారు. అట్లా అని అవతల వారిని ఆయనెప్పుడూ హర్ట్ చేసేవారు కాదు. ఇలాంటివి ఆయన చెప్పాల్సిన వారికే చెప్పేవారు గాని అడిగిన వారందరికీ చెప్పేవారు కాదు.

తిరుపతిలో ఒకసారి హోటల్ పై నుంచి క్రిందకు దిగుతున్నాము. జోరున వర్షం కురుస్తున్నది. బయట కెళ్ళాల్సిన పని వుంది కాని చికాకుగా వుంది. "ఇంత వర్షంలో ఎలా వెళ్తాం సార్ " అన్నాను. "ఏం ఫరవాలేదు. వర్షం ఆగిపోతుందిలే " అన్నారు. అంతే పైనుంచి క్రిందకు మెట్లు దిగి వచ్చేసరికి వర్షం ఆగిపోయింది. చినుకు ఒక్క బొట్టు కూడా రాలటం లేదు. ఆయన ఘటనా ఘటనా సమర్థులు. ఏమైనా చేయగలరు. ప్రకృతిని కూడా వారు అదుపుచేయగలరు. మాస్టరుగారు అంత శక్తి శాలి.

నాకు ఉద్యోగంలో రావాల్సిన ప్రమోషన్ రాకుండా ఒకరు నాపై వ్యతిరేకంగా వ్రాశారు. నిజానికి నా తప్పేమీ లేదు. నాకు ప్రమోషన్ రాదని తెల్సింది. ఈ విషయంలో బాధపడుతూ మాస్టరుగారికి వ్రాశాను. వెంటనే ఆయన గురుచరిత్ర లోని చాప్టర్ ఒకటి చెప్పి పారాయణ చెయ్యమన్నారు. అలా చేస్తుంటే నా ఫ్రెండ్ ఒకరు కలకత్తాలో మా పై ఆఫీసర్ గారితో నాకనుకూలంగా మాట్లాడారు. నాకు ప్రమోషన్ వచ్చింది. ఇది కేవలం మాస్టరుగారి అనుగ్రహమే అంటాను.

కాళహస్తి స్వామి మండలారాధనకు మాస్టరుగారు వచ్చినప్పుడు ఆయనను కలుసుకున్నాను. మాటల సందర్భంలో ఒకసారి తనను చూపిస్తూ, "ధ్యానం చేస్తాను గనుక ఈ శరీరం తట్టుకుంటున్నది గాని లేకపోతే ఏనాడో రాలిపోయేదే" అని అన్నారు. వారు కారణజన్ములు. మహాత్ములకు శరీరం కర్మవశాత్తో లేక ఋణానుబంధం వల్లనో రాదు. ఇతరులను ఉద్ధరించడానికి వారు శరీరాన్ని ధరిస్తారు అని అన్పించింది.'

ఒకసారి విద్యానగర్ వెళ్ళాను. అప్పుడు మాస్టరుగారు చాలా క్లిష్ట పరిస్థితులలో వున్నారు. రకరకాల నిందలు, అపోహలు, అపవాదులు వేసి ఆయనను కొట్టాలని, ఆవూరి నించీ వెళ్ళగొట్టాలని ప్రయత్నాలలో కూడా వున్నారు. కాని అలాంటి విషమ పరిస్థితులలో సైతం ఆయన తన నిజస్థితి నుంచి వీసమంతైనా చలించలేదు. అలాంటి స్థితప్రజ్ఞులు మన మాస్టరుగారు.

ఆయనెప్పుడు నిద్ర పోతారో ఏమో గాని ఎప్పుడూ చదువుతూనే వుండేవారు. ఆ సబ్జెక్ట్ ని ఈ సబ్జెక్ట్ అని గాక, అన్ని రకాల సబ్జెక్ట్ కి సంబంధించిన బుక్స్ చదివేవారు. వారి జ్ఞాపక శక్తి అమోఘం. ఎంతో శ్రమించేవారు. అంత శ్రమ మానవమాత్రుల వల్ల కాదు నా వుద్దేశ్యంలో. చీరాల్లో ఒకసారి మాకు తెల్సిన ఒక పంతులుగారు మాస్టరుగారిని కలుసుకున్నారు. ఆయన ప్రశ్నలు చెప్తూంటారు. ఆయన "రామకృష్ణ పరమహంస దగ్గరవున్న విద్య మీ గురువు గారి దగ్గర వున్నది" అని అన్నారు.

మాస్టరుగారు సమాధి అయ్యేముందు నాకు ఫోన్ ఫెసిలిటీ ఇచ్చారు. నాకు మాస్టరుగారికి ఫోన్ చేసి మాట్లాడాలని అన్పించేది నాకెందుకాలోచన వచ్చిందో తెలీదుగాని మాస్టరుగారికి గుండె జబ్బువచ్చినట్లు ఎలా వుందో అడుగుదామని ఫోన్ చేయటం, కానీ వాళ్ళేమనుకుంటారోనన్న ఆలోచన వచ్చి మళ్ళీ ఫోన్ పెట్టేయటం జరిగేది. మాస్టరుగారు నాతో అనేవారు. నువ్వు కలకత్తాలో ఎందుకు? ఆంధ్రాకి రమ్మనమనేవారు. కానీ ఆయన చెప్పిన మాటవినలేదు. "జీవితంలో ఎంతో విలువైన దాన్ని పొందే అవకాశాన్ని పోగొట్టుకుంటున్నావ్" అని చెప్పినా కూడా నేను అర్థం చేసుకోలేకపోయాను. మాస్టరుగారు ఒక సందర్భంలో "మహాత్ములు సమాధి అయ్యేటప్పుడు ఎవరైతే సమీపంలో వుంటారో వారు చాలా అదృష్టవంతులు. వారి తపశ్శక్తిని అక్కడున్న వారు పొందుతారు" అని చెప్పారు.

కానీ మాస్టరుగారు సమాధి అయిన సమయంలో నేనక్కడ వుండలేకపోయాను. నాకు ప్రాప్తం లేదని నన్ను నేను సమాధాన పరచుకోలేక పోతున్నానిప్పటికీ! ●

# బల్వంత్ నాచ్నే

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

శాంతారామ్ బల్వంత్ నాచ్నే తాలూకా ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తుండేవాడు. అతడు బాబా గురించి మొదట 1909 లో విన్నాడు. అతని అన్నగారిని బొంబాయిలోని ఒక ఆస్పత్రిలో కంఠవ్రణానికి శస్త్రచికిత్సకోసం చేర్పించారు. సరిగా అదే రోజున వారింటికొక సన్యాసి వచ్చి భిక్ష కోరాడు. భోజనం వడ్డించాక, బెండకాయ కూర కావాలని పదే పదే అడిగి వేయించుకుని, రోగికి బొంబాయిలో భద్రంగా శస్త్రచికిత్స జరిగిందని చెప్పి వెళ్ళాడు. అపుడు వారింటికి వచ్చిన ఘన్నే అను మిత్రుడు "సాయిబాబా దయవల్ల శస్త్రచికిత్స బాగానే జరిగివుంటుంది" అన్నాడు. సాయి గురించి బల్వంత్ నాచ్నే వినడం అదే ప్రథమం. సాయంత్రమయ్యేసరికి, అతని అన్నకు శస్త్రచికిత్స బాగా జరిగిందని, తర్వాత ఒక సాధువు వచ్చి అతడి కంఠం నిమిరి అది బాగవుతుందని చెప్పి వెళ్ళాడనీ బొంబాయినుండి కబురొచ్చింది. కొంతకాలం తర్వాత నాచ్నే తండ్రి ఒకరోజు దాసగణుచేసిన కీర్తనలో సాయిబాబా సాక్షాత్తూ దత్తాత్రేయుని అవతారమని విన్నాడు. అతడు సాయిపటం తీసుకొచ్చి నాటినుండి దానినిగూడ పూజించసాగాడు.

బల్వంత్ నాచ్నే మొదటిసారిగా 1912లో శిరిడీ వెళ్ళాడు. అంతకుముందే అతడు ప్రభుత్వ ఆదాయశాఖలో స్థిరమైన ఉద్యోగానికి అవసరమైన పరీక్ష వ్రాశాడు. దహనూలో పనిచేస్తున్న అతడు బొంబాయి నగరానికి ఉద్యోగంలో బదిలీ కావాలనిగూడ ఆశిస్తున్నాడు. కాని అదెంతో కష్టమైన పని. ఈ రెండు కోరికలూ దృష్టిలో పెట్టుకుని అతడు మరియిద్దరు మిత్రులతో కలసి శిరిడీ బయల్దేరాడు. వారు కోపర్గావ్ చేరాక అచటి స్టేషన్ మాస్టర్ వీళ్ళు శిరిడీ వెళ్తున్నారని విని బాబాను తీవ్రంగా విమర్శించాడు. బాబా కేవలం క్షుద్రశక్తులుగల మంత్రగాడని, అమాయక ప్రజలను తన క్షుద్రశక్తులతో లోబరుచు కుంటున్నాడని, ఆయననంతగా గౌరవించడం వ్యర్థమనీ విమర్శించాడు. అదంతా వినేసరికి బల్వంత్ నాచ్నేకు బాబాపట్ల ఎన్నో సంశయాలు కలిగాయి.

అయినా ఎలాగో ఆ బృందం శిరిడీ చేరింది. సరిగా అదే సమయానికి లెండీనుండి బాబా మశీదుకొస్తూ దారిలోనే వారికెదురయ్యారు. బాబా తిన్నగా బల్వంత్ నాచ్నేకేసి చూసి, "ఏమిటి, మమల్తదారు వద్ద సెలవు కోరకుండానే వచ్చావా? ఇంకెన్నడూ యిలా చేయకు!" అన్నారు. అంతటితో బాబా సర్వజ్ఞులని అతడికర్థమైంది. కోపర్గావ్ లో స్టేషనుమాస్టర్ చేసిన విమర్శలన్నీ పటాపంచలైనాయి. అపుడు నాచ్నే సాయి సన్నిధిలో మూడు రోజులున్నాడు. ఆ కొద్దికాలములోనే భక్తులపై బాబాకుగల ప్రేమ, మహత్తరమైన ఆయన దివ్యశక్తులను నిరూపించే సన్నివేశాలెన్నో చూచాక సాయి దత్తావతారమేనన్న విశ్వాసం అతడికి కలిగింది. ఒకరోజు బాబా అతని చేతిలోని ఊదీ తీసుకొని స్వయంగా అతని నొసట పెట్టారు. అది

వారి ప్రత్యేకమైన అనుగ్రహానికి చిహ్నం. తర్వాత ఒక ఏకాదశినాడు మధ్యాహ్న హారతికి ముందు సాయి యితనిని వాడాకు వెళ్ళి భోంచేసి రమ్మన్నారు. తన సాటివారు ఏకాదశినాడు ఉపవసిస్తుంటే తాను భోజనం చేయడం బాగుండదని తలచి ఆరతి అయ్యాక భోంచేస్తానన్నాడు. కాని సాయి అంగీకరించక అతడు భోజనం చేసి వచ్చేవరకూ ఆరతి ఆపించారు. తర్వాత ఒక భక్తురాలు సమర్పించిన తాంబూలం గూడ బాబా అతడికిచ్చి తినిపించారు. ఆరతి అయ్యాక బాబా అతనివద్ద ₹4/-లు, అతని మిత్రుడు వైద్యునివద్ద ₹16/-లు తీసుకున్నారు గాని; మిత్రుడు దాతేను దక్షిణ కోరలేదు. కారణం అతనికి దక్షిణ యివ్వడం యిష్టం లేదు.

అటుపై వివరం నాచ్నే యిలా వ్రాశాడు; "దాతే తనతోకూడ తెచ్చుకున్న బత్తాయి పండ్లలో కొన్నిటిని వాడాలో వుంచుకుని కొన్ని మాత్రమే బాబాకు సమర్పించాడు. వాటిని అందరికీ పంచేశాక, ఒక మార్వాడీ అమ్మాయి తనకు బత్తాయిలు కావాలని బాబా నడిగింది. ఆయన దాతేను మిగిలిన పండ్లుగూడ తీసుకురమ్మన్నారు. అతడు తాను వాటిని ఏకాదశినాడు అల్పాహారంగా తినేందుకు తెచ్చుకున్నానని చెప్పి యివ్వలేదు, బాబా యింక అడగనూలేదు.

రెండవ రోజు కాకా దీక్షిత్, జోగ్, దభోల్కర్ మొ॥న వారికి నన్ను చూపి బాబా, "నేనొకరోజు యితని యింటికి భిక్షకు వెళ్ళాను. కానీ వీళ్ళు నేనడుగుతేగాని నాకు బెండకాయ కూర వేయలేదు" అన్నారు. వెంటనే 3 సం॥ల క్రిందట అనగా 1909లో జరిగిన సంఘటన జ్ఞాపకమొచ్చి నేనెంతో ఆశ్చర్యపోయాను. కారణం మా యింటికొచ్చిన సాధువుకు, బాబాకూ పోలికలేదు. అపుడు నేను నా పరీక్షా ఫలితం గురించి అడిగితే బాబా, 'అల్లా మాలిక్ హై', 'అల్లా అచ్ఛాకరేగా' అని నా తలపై చేయివుంచి ఆశీర్వదించారు.

శిరిడీ చేరిన మూడవ రోజున మేము మశీదుకి వెళ్ళేసరికి అక్కడ బాబా పట్టరాని కోపావేశంతో చిందులు తొక్కుతున్నారు. ఆయన కళ్ళు చింత నిప్పులులా వున్నాయి. అందరూ భయపడి పారిపోయి 15 ని॥ల వరకూ మశీదులో అడుగు పెట్టడానికెవరూ సాహసించలేదు. అది చూచాక బాబా పిచ్చివారేమోనన్న సందేహం మాకుగూడ కలిగింది. చివరికెలాగో ఆయన శాంతించాక, మేము ముగ్గురమూ వెళ్ళి ఆయనవద్ద సెలవు కోరాము. బాబా నాకు ఊదీ యిస్తూ, "నీవు ఉద్యోగానికి బొంబాయి రావచ్చుగదా!" అన్నారు. (అది భవిష్యవాణో, వారి శాసనమో తెలియదుగాని, 6సం॥ల తర్వాత నాకు బొంబాయికి బదిలీ అయింది). నేను ఆఫీసులో సెలవు తీసుకోకుండా ఊరు విడిచిపోయినట్లు నా పై అధికారి బి.వి.దేవ్ గుర్తించాడుగాని, అతడు నాపై చర్య తీసుకోనక హెచ్చరికచేసి విడిచి పెట్టాడు.

అటుతర్వాత నేను 1913 నుండి మళ్ళీ మళ్ళీ శిరిడీ రాసాగాను. నేను 1913లో శిరిడీ బయల్దేరుతుంటే నా మిత్రుడు ఫన్సే నన్ను కలుసుకుని, అతడు ఆఫీసులో డబ్బు తినేశాడన్న అభియోగంపై తనకు జైలుశిక్ష విధించారని, ప్రస్తుతం తనను బెయిల్ పై విడుదల చేసారనీ చెప్పారు. తాను కోర్టులో అప్పీలు చేసుకోబోతున్నానని చెప్పి, తన తరపున బాబా ఆశీస్సులు కోరమని నాతో చెప్పాడు. నేను శిరిడీ చేరేసరికి చావడిలో కాకడ ఆరతి (ఉదయ హారతి) జరుగుతోంది. అపుడు బాబా ఎంతో కోపంతో వున్నారు. అయినప్పటికీ నన్ను చూస్తూనే ఆయన, 'వాడేమీ భయపడనక్కరలేదని చెప్పు. అప్పీలు చేసుకోగానే అతనిని విడుదల చేస్తారు' అన్నారు. నేను శిరిడీ నుండి తిరిగి రాగానే బాబా చెప్పినమాటలు ఫన్సేతో చెప్పాను. కాని అప్పటికే అతను విడుదల అయ్యానని చెప్పాడు! బాబా అభయమిచ్చిన వెంటనే ఆ కార్యం నెరవేరింది.

బాబా ఒకరోజు భక్తులందరి యెదుట నాతో, 'పిచ్చివాళ్ళను నమ్మగూడదు' అన్నారు. అపుడు నాకేమీ అర్థంగా లేదు. నేను 1914లో దహనూలో కోశాధికారిగా పనిచేస్తున్న కాలంలో ఒకరోజు యింట్లో పూజ చేసుకుంటున్నాను. అపుడు రామకృష్ణ బల్వంత్ ఫన్సే అను ఒక పిచ్చివాడు మా వంటగది తలుపు దగ్గర నిలుచుని వున్నాడు. అతడెవరినీ బాధించేవాడు గాదు. గనుక నేను పట్టించుకోలేదు. కాని నేను పూజ చేస్తుండగా మధ్యలో అతడు ఒక్కసారిగా నామీదకు దూకి నా గొంతు పిసుకుతూ, 'నీ రక్తం తాగుతాను!' అని కేకలేస్తున్నాడు. నేను వెంటనే ఉద్ధరణిని అతని నోట్లో అడ్డంగా పెట్టి, మరోచేత్తో ఆతని పట్టు విడిపించుకోజూచాను. అతడు నా వ్రేళ్ళు కొరికేస్తున్నాడు. మా అన్న నాకు సహాయమొచ్చేసరికి నేను

చచ్చినంత పనై స్పృహ కోల్పోయాను. తర్వాత వైద్య సహాయంలో నేను కోలుకున్నాను. తర్వాత నేను శిరిడీ వెళ్ళినపుడు బాబా నాకేసి చూస్తూ అన్నా చించినీకర్ తో, "అన్నా, నేనొక్క క్షణం ఆలస్యం చేసినా యితడు చచ్చేవాడే, ఆ పిచ్చివాడు యితడి గొంతు పట్టుకున్నాడు. నేనెలాగో యితనిని విడిపించాను. ఏంచేస్తాం, నా బిడ్డలను నేను రక్షించకుంటే ఎవరు రక్షిస్తారు?" అన్నారు.

మనం కష్టంలో వున్నపుడు బాబాను ప్రార్థిస్తాము. జైలుశిక్ష నుండి ఫన్సేకు విడుదల లభించినట్లు మనకుగూడ వెంటనే రక్షణ లభిస్తేనే బాబా రక్షించారనుకొంటాము. బల్వంత్ నాచ్నేకు ఉద్యోగం బొంబాయికి బదిలీ అయ్యేలా ఆయన ఆశీర్వదించాక అది ఫలించడానికి 6 సం॥లు పట్టింది. అలానే అతనిని పిచ్చివాని బారినుండి బాబా రక్షించినప్పటికీ, ప్రత్యక్షంగా ఆ సన్నివేశం చూచినవారికి బాబా రక్షించనట్లే తోస్తుంది. అందుకే బాబా రక్షణను పొందినా గుర్తించగలగాలంటే ఆయనపట్ల సంపూర్ణమైన విశ్వాసము, ఓరిమి రెండూ వుండాలి. బాబా మనను రక్షించినట్లు ఎంతగా అనిపించినా, నిజానికి యింకెంతగానో ప్రమాదించవలసిన పరిస్థితి అంతటితో పోతుందన్నది తథ్యం. సాయి ఎంత నిత్యసత్యులో వారి రక్షణగూడ అంత నిత్యసత్యమైనదే. మన విశ్వాసము, ఓరిమి అంతటివవడమే జరుగవలసింది.

"నేను, వైద్య 1915లో మరొకసారి బాబాను దర్శించాము. బాబా చేతినుండి ప్రసాదంగా తాను పూజించుకునేందుకు తీసుకోదలచి, వైద్య ఆయనకు వెండి పాదుకలు సమర్పించాడు. కాని బాబా వాటిని నాకు ప్రసాదించారు. 'అవి అతడివి గదా!' అని తలచి అతడికిచ్చివేసాను. శ్యామా ఆ విషయం బాబాతో చెప్పినపుడు, ఆయన వాటిని నాకు తిరిగి యిప్పించారు. వైద్యవద్ద మరొకజత వెండిపాదుకలు గూడా వున్నాయి. కాని బాబా వాటినిగూడ అడిగి తీసుకుని నాకే ప్రసాదించి 'వీటిని నీ దగ్గరుంచుకొని పూజించుకో!' అన్నారు. అవి వైద్యకు చెందినవని కనుక అతనికే యివ్వాలనీ నేనన్నాను. ఆయన, 'ఇప్పుడు నీ దగ్గరుంచుకో, అతనికి తర్వాత యివ్వవచ్చులే!' అన్నారు. నేనలాగే చేసాను.

ఆ సంవత్సరమే మరొకసారి మేము శిరిడీ వెళ్ళాము. నాకు కలిగిన పిల్లలందరూ మరణించడం వలన నాకు సంతానం ప్రసాదించమని మా అత్తగారు బాబాను కోరదలచింది. అపుడు శ్యామా నా భార్యను బాబా వద్దకు తీసుకువెళ్ళి ఆమె కొంగులో ఒక కొబ్బరికాయ వేయమని కోరాడు. అపుడు బాబా నాభార్యకు కొబ్బరికాయ ప్రసాదిస్తుండగా ఆయన కళ్ళలో నీళ్ళు నిండాయి. "ఆయన నన్ను తమవద్ద కూర్చుని పాదాలు వత్తమన్నారు. నేనలాగే చేస్తుంటే ఆయన నావీపు నిమిరారు, ఆయన ప్రేమకు కరిగిపోయాను. వెనుక ఒక పిచ్చివాడు నన్ను చంపబోయినప్పుడు నావద్ద వారి పటముండబట్టి గండం గడిచిందని బాబాతో అన్నాను. అపుడు బాబా, 'అల్లాహ్ మాలిక్ హై' అని మాత్రమన్నారు. అపుడు ఆయనా, నేనూ ఒకరినొకరం కౌగలించుకున్నాము.

ఒక భక్తుడు చేసుకునే సేవలో మరొకరు జోక్యం చేసుకుంటే బాబా తీవ్రంగా ఖండించేవారు. ఒకనాడు బాబా, "నాకు కడుపులో నొప్పిగా వుంది" అన్నారు. ఒక భక్తురాలు కాలిన ఇటుక, బాబా పొట్టమీద కఫ్నీ పైనే పెట్టి వారి డొక్కలను ఎంతో గట్టిగా మర్దించసాగింది. సున్నితంగా మర్దించమని ఆమెతో చెప్పాను. వెంటనే బాబా ఉగ్రులై నన్ను లేపి అక్కడ నుంచి వెళ్ళిపొమ్మని ఆదేశించారు. నేనలాగే చేసాను.

నాటి రాత్రి 8 గం॥లకు నేను మశీదుకు వెళ్ళి 'బాబా! నేను జపం ఏమని చేసేది?' అని అడిగాను. ఆయన, 'దేవపూర్ వెళ్ళి మీ పూర్వీకులందరూ అర్చించిన శిలలనే పూజించు' అన్నారు. తర్వాత నేను దహనూ తిరిగి వచ్చాక బాబా భావమేమని నా తండ్రిగారినడిగాను. ఆయన చెప్పినది: అయిదు తరాల వెనుక మా పూర్వీకుడైన బాబా ప్రయాగ్ కు 60 సం॥లు వచ్చినా సంతానం కలుగలేదు. అతడు ఏకనాథుని శిష్యుడైన బాబా భాగవత్ అను మహాత్ముని త్రయంబకంలో దర్శించాడట. అటు తర్వాత అతనికి కొడుకు పుట్టాడట. అప్పటినుండి మా వంశంలో ప్రతివారూ మా గురు వంశస్థులనుండి ఉపదేశం పొందటం ఆచారమైందిట. నన్నుగూడ అలానే చేయమని బాబా భావమట.

# ద్వారకామాయి అనుభవమండపము

నాకు మొదట ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. మూడవకాన్పుకి నాకు మగపిల్లవాడు పుడితే సుబ్రమణ్యస్వామికి తలనీలాలు ఇస్తానని మ్రొక్కుకున్నాను. మా అత్తమ్మ (నా భర్తగారి తల్లి) బాబు పుడితే శ్రీవేంకటేశ్వర స్వామికి తల నీలాలు ఇస్తానని ఆమె మ్రొక్కుకున్నది. కానీ మేము ఇలా మ్రొక్కుకొన్నట్లు బాబు పుట్టిన తరువాత తెలిసినది. అందుకోసము మొదట సుబ్రమణ్య స్వామికి తలనీలాలు ఇవ్వాలని నేను, కాదు మొదట వేంకటేశ్వర స్వామికి ఇవ్వాలని మా అత్తమ్మ. ఇలా మూడు సంవత్సరములు గడిపినాము. మధ్యమధ్యలో మేము చాలా సమస్యలను ఎదుర్కోవలసి వచ్చినది. అప్పటివరకు మాకు సాయిబాబాగారి గురించి వినడం తప్పితే వారిని గురించి ఏనాడు తలచుకొనలేదు. హైదరాబాద్‌లో మా అన్నయ్య వాళ్ళు శ్రీసాయిబాబాను కొలిచేవారు. వారు సాయిగురించి మాకు చెప్పారు. అప్పటినుండి మేము బాబా మీద కొంచెం కొంచెము భక్తి పెంచుకొనసాగాము. ఒకరోజు శ్రీసాయిబాబా పూజ చెయ్యాలనుకొన్నాము. కానీ మా దగ్గర 'బాబా' ఫొటో ఒక్కటి కూడా లేదు. ఏమి చేద్దామా అని అనుకొంటూ ఆ రోజు ఫొటో లేకుండానే పూజ చేసినాము. మరుసటి రోజు నా తమ్ముడు రెండు ఫొటోలు తీసుకొని వచ్చి, 'అక్కా నాకు ఈ ఫొటోలు దొరికినవి చూడు' అని నా చేతికి ఇచ్చినాడు. ఏవో ఫొటోలు అనుకుంటూనే వాటిని చేతికి తీసుకొని చూచాను. అంతే! నా ఆశ్చర్యానికి, ఆనందానికి అంతులేకుండా పోయింది. కారణం ఆ రెండు ఫొటోలు సాయివే. అవి ఓరిజనల్ ఫొటోలు. అప్పటికప్పుడే వాటిని ఫ్రేమ్ కట్టించి దేముడు గదిలో పెట్టాను. ఆ ఫొటోలు ఫ్రేమ్ కట్టించినతను ఆ ఫొటోలు చూచి డబ్బులు తీసుకొనలేదు. నేను అప్పటినుండి సాయిమీద భక్తి, గౌరవము పెంచుకొనసాగాను.

నేను సాయి గురించి పూజించడము తప్పితే శిరిడీ వెళ్ళి రావాలన్న కోరిక నాకు కలుగలేదు. ఒకరోజు హైదరాబాదులో వుండే మా అన్నయ్య "మేము 17-11-86న శిరిడీ వెళ్ళుచున్నాము. రాదలచుకుంటే మాకు ఉత్తరం వ్రాస్తే మేము టికెట్లు రిజర్వు చేయిస్తాము" అని ఉత్తరం వ్రాశాడు. అపుడు నా భర్త "నీకు నిజంగా సాయిబాబా మీద నమ్మకము వుంటే సాయి నీమీద కరుణ చూపితే డబ్బుకూడా ఎలాగో చూపించుతాడు" అని అన్నాడు. ఆఖరికి నా మొర సాయి ఆలకించి నన్ను ఆయన సన్నిధికి 18-11-86న రప్పించుకొన్నారు.

ఆ రోజే నా పిల్లలకు తలనీలాలు తీసి వేయించినాను. సాయిబాబాలోనే నాకు సుబ్రమణ్యస్వామి, వేంకటేశ్వర స్వామి ఉన్నారని తలచి సాయి సన్నిధిలో తలనీలాలు తీపించేశాను. ఆ రోజే బాబు పేరు వేంకటనాగసాయివరప్రసాద్‌గా పెట్టాము. ఆ తరువాత నాకు గత మూడు సంవత్సరాలుగా కాలునొప్పిగా ఉండేది. ఎన్ని మందులు వాడినా, ప్రయోజనము కనపడక సాయిని నమ్ముకొని గురువారం నాడు సాయంత్రం 5-39 గం॥లకు నేను గురుస్థాన్ దగ్గర 150 చుట్లు తిరిగాను. నాకు 80 చుట్టులో ఒక బండపైన ఒక ముసలాయన సాయిలాగ తలకి ఒక గుడ్డ చుట్టుకొని చేతిలో ఒక చిన్న కర్ర పట్టుకొని ఏదో అంటే నాకేసి చూస్తూ చేతితో దీవించినట్లు ఉన్నాడు. 150వ చుట్టు తిరిగి ఆ ముసలాయనికి నమస్కారం చేసుకుందామని అచ్చట చూస్తే ఆయన అచ్చట కనపడలేదు. ఆ రోజు నుండి నేను వచ్చే వరకు ఆ ముసలాయన ఎచ్చటయినా కనిపించుతాడేమోనని వెదికాను. కానీ ఎక్కడ కనపడలేదు. నాకు కాలునొప్పి మరలా రాలేదు. ఈ రోజుకి నేను ఎంతో సంతోషంగా ఉన్నాను.

**శ్రీమతి యం. పద్మావతి,**
**శ్రీహరికోట**

# ఆచార్యుని అద్భుత లీలలు

ఒంగోలుకు వాస్తవ్యులు మల్లికార్జున్ గారు పూజ్యశ్రీ మాస్టరుగారి లీలావైభవాన్ని ఇలా తెలియజేస్తున్నారు---

మాది ఒంగోలు. బీటెక్ చదువుకునే రోజుల్లో బాబా గుడిలో ప్రదక్షణలు చేస్తుండేవాడిని. అప్పుడే పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి మందిరం చూశాను. అప్పటినుండి సమాధి దర్శనం చేసుకుంటుండే వాడిని. మాది ఒంగోలే అయినా పూజ్యశ్రీ మాస్టరుగారిని సశరీరంగా దర్శించుకోలేకపోయాను. అప్పుడు మాకు ఆయన గురించి తెలియదు. ఇప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి నిలయం పక్క వీధిలోనే మా ఇల్లు వుంది. నేను బీటెక్ చదివే రోజుల్లో రెండు సంవత్సరాలు అనారోగ్యం కారణంగా నా చదువు ఆగిపోయింది. నేను ప్రతిరోజూ సమాధి మందిరం దగ్గర కూర్చునేవాడిని. అక్కడ చాలా ప్రశాంతంగా వుండేది. అక్కడ జరిగే అన్ని కార్యక్రమాలకు వెళుతుండేవాడిని. ఉదయం, సాయంత్రం రెండు పూటలా సమాధి మందిరం దగ్గర కూర్చుని ఆ ప్రశాంతతని తనివితీరా అనుభవించే వాడిని. ప్రతి విషయాన్ని అక్కడ చెప్పుకునేవాడిని. అలా చేస్తుంటే చదువు, ఆరోగ్యం చక్కబడ్డాయి. మా ఇంటి సమస్యలన్నీ తీరడం ఇంట్లో వాళ్లందరికీ అనుభవంలోకి వచ్చింది. ఒంగోలులోని సమాధి మందిరం నాకొక అయస్కాంతం. తరువాత నాకు వివాహమయింది. వివాహంలో అందరికీ శ్రీ సాయిలీలామృతము గ్రంథాలు పంచాను.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం హైదరాబాద్ వచ్చాను. అక్కడ గురుపూజలు జరిగితే వెళ్లి అక్కడ కూడా శ్రీ సాయిలీలామృతము గ్రంథాలు పంచాను. అక్కడికి వచ్చిన ఒక భక్తుడు నాకు మెకానికల్ ఇంజనీరింగ్ కి సంబంధించిన ఉద్యోగం ఇప్పించాడు. తర్వాత సాఫ్ట్‌వేర్ నేర్చుకున్నాను. నాకొక బాబు పుట్టాడు. వాడికి 'సాయి భరద్వాజ' అని పేరు పెట్టుకున్నాను.

మళ్లీ కొన్నాళ్లకు నా ఉద్యోగానికి ఆటంకం వచ్చింది. అదే సమయంలో గొలగమూడిలో సమ్మేళనం జరుగుతోంది. 'వెళదామంటే పరిస్థితి కష్టంగా వుంది, ఎలా వెళ్లాలి?' అని పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పుకుని బాధపడ్డాను. ఒక ఆఫీసులో రెజ్యూమ్ ఇచ్చాను. ఆ ఆఫీసుకు వెళితే ఉద్యోగాలేమీ లేవన్నారు. నా ఎదురుగా వున్నాయన "జాబ్ నేనిస్తాను!" అని వెంటనే ఉద్యోగమిప్పించారు. నేను సమ్మేళనానికి వెళ్లి వచ్చి ఉద్యోగంలో చేరాను.

కొన్ని సంవత్సరాల క్రితం మా అమ్మ బయటికి వెళ్లి రిక్షాలో ఇంటికి వస్తుంటే రిక్షావాడు మా సందుకి బదులు పూజ్యశ్రీ మాస్టరుగారి ఇల్లున్న సందులోకి రిక్షా తీసుకుని వెళ్ళాడట. అక్కడ ఏదో హడావిడిగా వుంటే మా అమ్మ రిక్షా దిగి పూజ్యశ్రీ మాస్టరుగారి నిలయంలోకి వెళ్ళింది. ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారి, పూజ్యశ్రీ అమ్మగారి కల్యాణోత్సవం జరిగిన రోజు! అప్పుడు అక్కడ పూజ చేస్తున్నారు. అక్కడ గురుబంధువులు మా అమ్మని కూడా పూజ చేసుకోమన్నారు. మా అమ్మ పూజ చేస్తూ, " నేనేమీ పళ్లు తీసుకోకుండా వచ్చేశాను. సరే దక్షిణ వేద్దాం!" అని అనుకుందట. పూజ ముగిసాక ప్రసాదం తీసుకుని ఇంటికి వచ్చేసింది. రాత్రి నిద్రపోయాక కలలో పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించి, "ఏమ్మా దక్షిణ సమర్పించకుండా వచ్చేశావేమి?' అన్నారట! మా అమ్మ, "అయ్యో!" అనుకుని సమర్పించబోతే, "ఇప్పుడొద్దు!" అని, "మీ పెద్దబ్బాయిని

తీర్థయాత్రలకు పంపించండి. ఒక క్షేత్రంలో మీ వారు మీ అబ్బాయి కోసం మొక్కుకున్నారు. (అది కాణిపాకం!) ఆ క్షేత్రం నుంచి ఒక పటం తెచ్చి ఇంట్లో పెట్టుకోండి" అని చెప్పారట. ఇవన్నీ అక్షర సత్యాలు! పూజ్యశ్రీ మాస్టరుగారు నన్నే కాకుండా మా ఇంటిల్లిపాదినీ కంటికి రెప్పలా కాపాడుతున్నారు.

నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి దయతో బెంగళూరులో మంచి ఉద్యోగం వచ్చింది. నా మనస్తత్వం చాలా చిత్రంగా వుండేది. ఒంగోలు దాటి బెంగళూరు వచ్చానంటే నా నిత్య వ్యవహారాల పట్ల ధ్యాసే తప్ప బాబాకి, పూజ్యశ్రీ మాస్టరుగారికి ఏమీ చేసేవాడ్ని కాదు. మళ్లీ ఒంగోలు వెళితే బాబాగుళ్లోనే వుండేవాణ్ణి!

ఒకసారి బెంగళూరులోనే చాలా కష్టపడి శ్రీగురుచరిత్ర పారాయణ చేశాను. ఆ రోజు రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చారు. ఆయన సత్సంగమందిరంలో సత్సంగం చేస్తున్నారు. తిరిగి వెళ్లేటప్పుడు ఆయన్ని అనుసరించి ఆయనను, "నిజంగా నాకు కనిపించారా? మీరేనా?!" అని అడిగాను. "ఆ ..నేనే!" అన్నారు. ఒకసారి పక్కకి పిలిచి కాళ్లమీద పడి, "అన్ని జన్మలలోనూ మీరు నాకు గురువుగా వుండండి మాస్టరుగారూ!" అని అడిగాను. "సరే!" అన్నారు. "నేను మిమ్మల్ని మర్చిపోయినా మీరు నన్ను మరచిపోవద్దు!" అనడిగితే, "సరే!" అన్నారు. కల ముగిసింది. నా గురువుగారు పూజ్యశ్రీ మాస్టరుగారేనని నాకు తెలిసింది. కానీ ఆ కల విలువ నాకప్పుడు తెలియలేదు. నా ఉద్యోగం, నా వ్యవహారాల మీదే దృష్టి తప్ప ఒంగోలులో వున్నట్లు మనస్సు వుండేది కాదు. కానీ ఒంగోలు వెళ్తే మాత్రం నా మకాం పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి దగ్గరే!

కొన్నాళ్ళకు తిరిగి మళ్లీ సమస్యలొచ్చాయి. చదువుకునే రోజుల్లో లాగానే నా ఆరోగ్యం దెబ్బతిన్నది.ఆసమయంలోవిద్యానగర్‌లో వేదక్కను, బావగారిని కలిశాను. తర్వాత ఫోన్ ద్వారా నా విషయం తెలియజేశాను. పూజ్యశ్రీ అమ్మగారు శ్రీ సాయిలీలామృతము పారాయణ చెప్పారు. ఈసారి పారాయణ చేస్తుంటే ఆ గ్రంథంలో సంఘటనల్నీ మనల్ని బాగుచేయడానికే వున్నాయనిపించింది. నిజంగా అది అమృతము అన్న భావన వచ్చింది. నా ఆరోగ్యం చాలావరకు మెరుగైంది. నా నిత్యవిధులన్నీ ఆటంకం లేకుండా సాగుతున్నాయి. నేనిప్పుడు ఉద్యోగరీత్యా దుబాయిలో వుంటున్నాను. నాకు పూజ్యశ్రీ అమ్మగారితో పరిచయమైన దగ్గరనుండి 'గురుదంపతులే నా తల్లిదండ్రులు!' అన్న భావన కలిగింది.

2018 ఫిబ్రవరి నెలలో నాగోలులో జరిగిన కల్యాణోత్సవంలో జరిగిన అనుభవాన్ని మీతో పంచుకుంటున్నాను .

మా అమ్మ విపరీతమైన మోకాలినొప్పితో బాధపడుతూ వుండేది. అందువల్ల మోకాళ్ల ఆపరేషన్ చేయించాము. ఆపరేషన్ బాగానే జరిగినా తిరిగి కొన్నాళ్లకు మోకాళ్ళలో విపరీతమైన మంట, నొప్పులు మొదలయ్యాయి. ఒంగోలు, విజయవాడ, బెంగళూరు -- అన్ని ఆసుపత్రులలోనూ చూపించాము. "సమస్య ఏమీ లేదు. అంతా బాగానే వుంది. మరి అంత బాధపడుతున్నారంటే ఆ దేవుడే మిమ్మల్ని కాపాడాలి!" అని అన్నారు వైద్యులు. ప్రకృతివైద్యం, హోమియోపతి.. ఇలా దేనివల్ల కూడా నయం కాలేదు.

అప్పుడు ఫిబ్రవరి 9, 10 తేదీల్లో పూజ్యశ్రీ మాస్టరుగారి కల్యాణోత్సవం నాగోలులో పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో జరుగుతున్నదని తెలిసింది. బాబా చరిత్రలో 'కేవలం వారి సన్నిధే జీవులకు స్వస్థత చేకూర్చగలదు!' అని చెప్పినట్లు అదే వాక్యాన్ని విశ్వసించి వారిపై భారం వేసి, కల్యాణోత్సవానికి మా అమ్మని తీసుకువచ్చాను. పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి వెళ్లినప్పటినుంచి వ్యాధి తగ్గుముఖం పట్టింది. ఎప్పటినుండో నయం కాదని ఆశలు వదులుకున్న వ్యాధి ఆశ్చర్యంగా ఇబ్బంది లేనంతగా తగ్గిపోయింది! తిరిగివచ్చాక మా అమ్మ హాయిగా ఏ బాధా లేకుండా వుంది. మేము ఈ రోజు హాయిగా ఇలా వున్నామంటే అది కేవలం వారి భిక్షే!

పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు నానుంచి కోరుకుంటున్న మార్పుని నాలో కలిగేలా అనుగ్రహించమని, వారి పాదాల వద్ద ఎల్లప్పుడూ భక్తితో వుండేలా ఆశీర్వదించమని ప్రార్థిస్తున్నాను.

జై సాయి మాస్టర్ !!

**శ్రీ మల్లికార్జున్,**
*ఒంగోలు*

## దుఃఖాన్ని రూపుమాపుకోవడమే ఆధ్యాత్మికత!

05వ పేజీ తరువాయి

సాన్నిధ్యమైనా మనకు లభించాలి. లేకుంటే అట్టివారి సమగ్ర జీవిత చరిత్రలనైనా మనం పరిశీలించాలి. మనకపరిచితులైనవారిని ప్రేమించడమెలా సాధ్యం? అందుకని శ్రీ సాయిబాబా యొక్క సమగ్ర జీవిత చరిత్రను, బోధనూ అధ్యయనం చేయడమొక్కటే వారిపట్ల ప్రేమను పొందడానికిగాని, అట్టి ప్రేమతో వారిని సేవించడానికి గాని ముఖ్యసాధనం. మహనీయుల ప్రత్యక్ష సాన్నిధ్యం లభించడమెంతో కష్టసాధ్యం. మనకు తారసిల్లినవారు అంతటి మహనీయులౌనో కాదో తెలియడమే సాధ్యంకాదు. తెలియకున్నా ప్రయత్నించి వారిని విశ్వసించాలని తలచటం భ్రాంతి మాత్రమేనని యెందరి అనుభవాలో నిరూపిస్తాయి. శ్రీ సాయి వంటి సద్గురువులను పై దెల్పిన రీతిన సేవిస్తూంటే వారి దర్శన ఆశీస్సులు ఈనాటికి ప్రత్యక్షంగా లభించగలవని యెందరి అనుభవాలో నిరూపిస్తున్నాయి.

ఈ రహస్యం తెలుసుకోకుండానే భజన జపాదులు చేయటంతో సంతృప్తి పడడం పామరులు వైద్యగ్రంథాన్ని చూచి తమకు తాము మందు వేసుకున్నట్లే. ఈత రానివారు సమర్థుడైన ఈతగాని సహాయం లేకుండానే నదిలో దూకి ఈత నేర్వ సాహసించినట్లే. ఈనాడు మనమీ సత్యాన్ని గుర్తించడం లేదు కనుకనే దేశంలో యెన్ని భజన సమాజాలున్నా వాటిలో ఒక్కరూ ఆధ్యాత్మికంగా పైస్థాయికి పోవడం కన్పించడం లేదు. సమాజంలో భక్తి విశ్వాసాలు వెనుకబడుతూనే ఉన్నాయి. అలా వెనుకబడకుండా వుండడానికి ఆధ్యాత్మిక చక్రవర్తియైన సాయిని సేవించుకుందాం! ●

## సత్కార్యాల వల్ల మంచి ఎప్పుడూ వుంది!

12వ పేజీ తరువాయి

మతబోధనలను మనం విశ్వసించి, మత సంబంధమైన కార్యాలు చేస్తే ఇహానికేకాక పరానికి కూడ ఫలితం కల్గిస్తుంది.

వనవాసానికి బయలుదేరిన శ్రీరామచంద్రమూర్తిని కౌసల్యాదేవి –

*శ్లో॥ యం పాలయసి ధర్మం*
*త్వం ధృత్వా నియమేన చ ।*
*సవై రాఘవ శార్దూల*
*ధర్మ స్త్వా మభిరక్షతు॥*

–అని ఆశీర్వదిస్తుంది. ఆయన ఏ ధర్మాన్ని అనుష్ఠిస్తున్నాడో ఆ ధర్మమే ఆయనను కాపాడుతుందని ఆ తల్లి విశ్వసించింది. ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనల రక్షిస్తుంది. ఈశ్వర రాజ్యంలో చెలామణి అయ్యే కాసులే ధర్మం.●

## శ్రీ సాయిబాబా ప్రసాదించిన పన్ను కథ

17వ పేజీ తరువాయి

ఆశ్చర్యం. తర్వాత దాని స్థానంలో ఒక చక్కని పాలరాతి సాయి విగ్రహం స్థాపించినా యీ పటాన్ని మాత్రం యీ అద్భుతమైన సాయి లీలకు సాక్ష్యంగా యిప్పటికీ మందిరంలో శ్రద్ధగా పూజిస్తారు. సాయి చెల్లించిన పన్ను చాలా మహిమ గలది. ●

## వార్తాలాపము

15వ పేజీ తరువాయి

అబుహ రేస' అనే సత్పురుషునితో ఒక మహాత్ముడు "నాతో రా! నీకు మాయ యొక్క సంపూర్ణ స్వరూపాన్ని చూపిస్తాను!" అని చెప్పాడు. అతనిని ఎముకలు, మలమూత్రాలు, చింకి గుడ్డలు మొదలైన పదార్థాలున్న ప్రదేశానికి తీసుకుని వెళ్ళి ఇలా అన్నాడు:

"నీవు చూస్తున్న ఆ పుర్రెలు పూర్వము ఎవరు తృష్ణ, ఈర్ష్యలతో వుండి వున్నారో వారివి. ఇప్పుడు వారి పుర్రెలు మాత్రమే మిగిలాయి. ఇవి కూడా కాలాంతరంలో నశించిపోతాయి, ఎంతో రుచిగా వుండి, ఎంతో ప్రయత్నంతో కష్టపడితే గాని, తయారుగాని, దొరకని ఆహారపదార్థాలన్నీ ఈ మలరూపాన్ని పొందాయి. ఎన్నో అమూల్యమైన వస్త్రాలు ఇక్కడ చినిగిన గుడ్డలుగా పడివున్నాయి. వాహనాలకు ఉపయోగించే గుఱ్ఱాలు, ఏనుగులు ఈ ఎముకల రూపంలోనే మిగిలివున్నాయి. మాయకు ఆరంభాన్ని, అంతాన్ని ఇక్కడే చూడవచ్చు."

- సశేషం

జై సాయి మాస్టర్!

# శ్రీ 'సాయిబాబా' పాఠకులకు విజ్ఞప్తి

పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్య బోధనలను, వివిధ మహాత్ముల గూర్చిన విషయ విశేషములు, ఇంకా ఇతరములైన ఎన్నో ఆధ్యాత్మిక, విజ్ఞాన విషయాలను పఠించడం ద్వారా పూజ్యశ్రీ మాస్టర్‌గారి సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ, ఆనందిస్తున్న 'సాయిబాబా' మాసపత్రిక పాఠకులకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారి 80వ జన్మదిన సందర్భంగా శ్రీ మాస్టరుగారితో భక్తులకు గల అనుభవాలను అక్టోబరు 2017 సంచిక నుండీ ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. కనుక పాఠకులు పూజ్యశ్రీ మాస్టరుగారితో తమకుగల అనుభవాలను పత్రికకు పంపవలసినదిగా ప్రార్థన.

అదే విధంగా శ్రీ సాయినాథునితో తమకుగల అనుభవాలను గూడా పంపవలసినదిగా ప్రార్థన.

పూజ్యశ్రీ మాస్టరుగారితో గల అనుభవాలను 'ఆచార్యుని అద్భుతలీలలు' అను శీర్షికకు, శ్రీ సాయినాథునితో గల అనుభవాలను 'ద్వారకామాయి అనుభవమండపము' అను శీర్షికకు పంపగలరని మనవి.

ఇట్లు
ఎడిటర్.

SRI GURUPADUKA PUBLICATIONS,
C/O SRI MANGA BHARADWAJA TRUST,
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550

## పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 450-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 50-00 |
| ఏది నిజం? | 50-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్త్వం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 128-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము-మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2) | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master(Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's SaiBaba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba(Hindi) | 150-00 |
| Sai Leelamrutham(Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham(Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 99-00 |
| Sri Guru Charitra(Kannada) | 45-00 |
| Shiridi Aarathi(Tamil) | 15-00 |
| Stavana Manjari(Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |

**SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.
Phone: 08592 233271
**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.**

బాలల

# శ్రీ గురుచరిత్ర



శ్రీమతి అడిదం వేదవతి

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.




## 'శ్రీ సాయిలీలామృతము'

## మహాగ్రంథ కృతజ్ఞతార్చన మహోత్సవము

**09TH MAY, 2021**

*IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.*